

Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 28 - No.3

January 2022

*“కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి” (2 కొరింథీ 5:17)*

## నూతన సృష్టి

# కృతజ్ఞత

*ప్రతి విషయమందును కృతజ్ఞతాస్తులు చెల్లించుడి. ఇలాగు చేయుట యేసుక్రీస్తునందు మీ విషయంలో దేవుని చిత్తము - 1 థెస్స 5:16-18*

అమెరికా దేశ, అట్లాంటిక్ తీరములోని కేప్ హెన్రీ అనే ప్రాంతానికి ఒక చరిత్ర ఉంది. ఇంగ్లాండ్ రాజైన మొదటి జేమ్స్ పెద్ద కుమారుడైన హెన్రీ ఫ్రెడ్రిక్ పేరుమీద 'కేప్ హెన్రీ' అనే పేరు వచ్చింది. 1607సం॥లో రాబర్ట్ హంట్ అనే అంగ్లికన్ ప్రీస్ట్, కొంతమంది వ్యక్తులతో కలిసి ఇంగ్లాండు నుండి మూడు ఓడల్లో 144 రోజుల క్లిష్టమైన ప్రయాణం తరువాత అనుకోని రీతిగా మొదటి సారి అమెరికాలోని ఆ ప్రాంతములో అడుగుపెట్టారు. అడుగు పెట్టిన వెంటనే వారు ముందుగా చేసిన పనేంటంటే ఒక చెక్క సిలువను నిలువబెట్టి, నూతన ప్రాంతములో అడుగుపెట్టడానికి సహాయం చేసిన దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించారు.

కృతజ్ఞత తెచ్చిపెట్టుకునే ఒక గుణం కాదు. దేవుడు మన జీవితంలో చేసిన కార్యాలన్నిటిని జ్ఞాపకం చేసుకొని తన్మయత్వానికి గురైనప్పుడు, మన నుంచి పెల్లుబుకే భావన. కృతజ్ఞత అంటే చేసిన సహాయం మర్చిపోకుండా ఉంటూ, దాన్ని ఎప్పుడు జ్ఞాపకం చేసుకొనేవారిని కృతజ్ఞులు అని అంటారు.

అంత్యదినాల్లో ప్రజలు ఎలా ఉంటారో చెబుతూ 1 తిమోతి 3 అధ్యాయంలో 18 లక్షణాలను పౌలు ప్రస్తావిస్తాడు. వాటిలో ఒకటి కృతజ్ఞత లేకపోవడం. కృతజ్ఞత లేకపోతే ప్రమాదం ఏమైనా ఉందా? అని అంటే ఖచ్చితంగా ఉందనే చెప్పాలి. దేవుడు చేసిన మేళ్ళను తలంచకుండా, కృతజ్ఞతతో కూడిన జీవితం జీవించకుండా వాటిని మరచిపోయే వారి జీవితాలు ఎలా ఉంటాయో దానికి ఇశ్రాయేలీయుల జీవితం ఒక మంచి ఉదాహరణ. దేవుడు చేసిన మేళ్ళను మరచిపోవడం వల్ల వారు దేవునిమీద తిరగబడ్డారు (కీర్తనలు 78:17), తమ హృదయాల్లో దేవునిని శోధించి, దేవుని మహాశక్తిని తక్కువగా అంచనా వేసి ఆయనను శంకించి, ప్రశ్నించారు. (18వ), దేవునియందు విశ్వాసముంచలేదు (22వ), వారి హృదయం దేవుని యెడల స్థిరంగా ఉండలేదు (36), నోటిమాటతో వారాయన్ని ముఖస్తుతి చేశారు ((37వ), మాటిమాటికి ఇశ్రాయేలు పరిశుద్ధ దేవునికి సంతాపము కలిగించారు (41వ), ఉన్నత స్థలాలను కట్టి ఆయనకు కోపం పుట్టించారు, విగ్రహాలను పెట్టుకొని ఆయనకు రోషము కలుగజేశారు (58వ), ఫలింతగా దేవుడు వారిని చూసి ఆగ్రహించి, బహుగా అసహ్యించుకొన్నాడు (59వ). దేవుని మేళ్ళను గుర్తుచేసుకొని ఆయనను స్తుతించడం ఇశ్రాయేలీయుల అనుదిన జీవన శైలికాదు. కేవలం శ్రమల్లో మాత్రమే ఆయనను జ్ఞాపకం చేసుకునేవారు. అందువల్ల వారి జీవితాల్లో స్థిరత్వం లోపించింది. చివరిదాకా నమ్మకంగా వెంబడించలేకపోయారు. దేవునికి ఇష్టులుగా ఉండలేకపోయారు.

తేనెటీగ తియ్యని, మధురమైన తేనెను ఇస్తుంది, దాన్ని రెచ్చగొడితే దాడిచేసి కుడుతుంది. ఇది దాని స్వభావం. మానవుల స్వభావం కూడా అంతే. అయితే దేవుని స్వభావం భిన్నమైనది. దేవుడు ఇశ్రాయేలీయులకు అనేక మేళ్ళను చేసి, వారు ఆయన మీద తిరగబడినా, మాటిమాటికి రోషం కలుగజేసినా, అపవిత్ర జీవితం జీవించినా, వారిని సమూల నాశనం చేయకుండా వారిపై మాటిమాటికి దయ, కరుణ, క్షమ చూపించాడు. ఆయన వాత్సల్యపూర్ణుడు, దోషాన్ని పరిహరించే దేవుడు, పలు మార్లు కోపాన్ని అణచుకునే దేవుడు (కీర్తనలు 78:38). చాలాసార్లు ఇశ్రాయేలీయులవలె మన జీవితాలు కూడా ఉంటున్నాయి. మన అవిధేయత, అవిశ్వాసం, అపవిత్ర త జీవితాల ద్వారా మాటి మాటికి దు:ఖపెడుతూ కోపాన్ని కలుగుజేస్తున్నాము. మన పాపాలను బట్టి దేవుడు మనకు ప్రతీకారం తీర్చితే మనమందరం నశించిపోయేవారమే. కానీ దేవుడు మనపట్ల తన కృపను, ప్రేమను, జాలిని చూపిస్తున్నాడు. దీనిని బట్టి మనం దేవునికి కృతజ్ఞతలు తెలుపుతూ, కృతజ్ఞతా జీవితాన్ని జీవించాలి.

"ఒక వ్యక్తి జీవితంలో దేవుడు ఎన్నో మేలులు చేస్తూ, ఎన్నో విధాలుగా కాపాడుతాడు. అయితే మనం వాటిలో కేవలం ఐదు లేదా ఆరు సంఘటనల్ని మాత్రమే గుర్తుంచుకొంటాము" అని అంటాడు జాన్‌మెకార్థర్. నిజమే, దేవుడు మనల్ని గత సంవత్సరమంతా ఎన్నో ఒడుదుడుకుల నుండి, అపాయాలనుండి కూడా అద్భుతంగా కాపాడాడు. భౌతికంగా, ఆత్మీయంగా ఎన్నో కార్యాలు, మేళ్ళు చేశాడు. మనల ను ప్రేమించి, తన కృపను మనకు అనుగ్రహించి నూతన సంవత్సరంలో ప్రవేశింపచేశాడు. వీటన్నిటిని బట్టి కీర్తనాకారునివలె ఎల్లప్పుడు దేవునికి కృతజ్ఞతలు తెలియజేయాలి. కృతజ్ఞతతో కూడిన జీవితం మనల్ని దేవునిలో స్థిరపరుస్తుంది. దేవునియెడల విశ్వాసాన్ని పెంపొందిస్తుంది. క్లిష్ట పరిస్థితుల్లో కలవరాన్ని తగ్గిస్తుంది. నిరీక్షణ, పవిత్ర జీవితాన్ని కలిగి జీవించేలా చేస్తుంది. కృతజ్ఞత లేనివారంటే దేవునికి ఇష్టంఉండదు. నూతన *సంవత్సర శుభాకాంక్షలతో...*

**- పి. సునీల్ జాకబ్**

విద్యార్థి జ్వాల

Vol. 28, No.3, January 2022
A Publication of
UESI Publication Trust

EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana
Dr. J. Subbarao - Sec., Litt.Dept.

CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508

ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

2022

ప్రభువునందు ప్రియమైన
విద్యార్థి జ్వాల
పాఠకులకు
# నూతన సంవత్సర
శుభాకాంక్షలు

– ఎడిటోరియల్ బోర్డ్

## లోపలి పేజీల్లో...


- కృతజ్ఞత - 2
- కొత్త సంవత్సరంలో కొత్తదనం - 4
- నూతన సృష్టి - 8
- క్రాస్ వర్డ్ పజిల్ - 12
- నూతన కార్యాలకు ఆహ్వానం - 13
- ఒకరినొకరు ప్రేమించడం - 16
- భారతదేశంలో క్రైస్తవ విశ్వాసం - 19
- రహస్య జీవితం - 22
- కమిట్‌మెంట్ కొంతకాలం మాత్రమే కాదు - 25
- ఆయుష్కాలము నీ వరమే - 28
- జీవితం అల్పమైనది- 30
- కోశాధికారి లేఖ - 31






# కొత్తసంవత్సరంలో కొత్తదనం

మరో క్రిస్మస్ గడిచిపోయి కొత్త సంవత్సరం వచ్చేసింది. ఇప్పుడు మనం 2022సం॥లో ఉన్నాం. ఈ నూతన సంవత్సరం మనకు కొత్త సదవకాశాల్ని, కొత్త సమస్యల్ని సరిసమానంగా తెస్తుంది. యేసయ్య తన శిష్యులకు "ఈ లోకంలో, మీకు శ్రమ ఉంటుంది" (యోహాను 16:33) అని హెచ్చరించారు. కోవిడ్-19 కాలంలో ఇది మన అను భవం కూడా. కొన్ని కుటుంబాలు ఈ క్రిస్మస్ సమయంలో, కొత్త సంవత్సరంలో నూతన శిశువులను స్వాగతించగా, మరికొందరు తమ ప్రియమైన వారికి కన్నీటితో వీడ్కోలు పలికారు. యోహాను 16:33 లోనే యేసయ్య శ్రమ, ఇబ్బంది, కష్టాలు ఉంటాయని చెప్పేముందు యేసయ్య ఇచ్చే సమాధానం గూర్చి కూడా వాగ్దానం చేశాడు. ఆయన లోకమును జయించియున్నాడు కనుక క్లిష్ట పరిస్థితుల్లో, అన్ని విషయాలలో ధైర్యము తెచ్చుకొని ముందుకు సాగిపొమ్మన్నాడు. ఈ కొత్త ఏడాదిలో నూతన ధైర్యముతో, నిబ్బరంతో, నిరీక్షణతో, కృతజ్ఞతతో, విశ్వాసంతో సంవత్సరాది మొదలు సంవత్సరాంతం వరకు నూతనత్వంతో దేవునిలో ఎలా ముందుకు సాగిపోవచ్చో చూద్దాం.

### కొత్తసంవత్సరం - దేవుని బహుమానం

తెగులు, వేదనలు మరణ శాసనమై, గడచిన దినములు గాడాంధకారమై జరుగుచుండగా, సంవత్సరాలు దిగులుతో దొర్లుచుండగా, 'క్రొత్త యేడు మొదలుబెట్టెను మన బ్రతుకునందు' అనే పాతపాటను అలవాటుగా పాడుకొంటూ కొత్త సంవత్సరంలోకి ఉదాసీనంగా వచ్చేశామా? లేక నూతన సంవత్సరాన్ని దయా కిరీటంగా మనకు అనుగ్రహించిన దేవుని కృపలను జ్ఞాపకం చేసుకొంటున్నామా?

మన జీవితంలో వచ్చే ప్రతి నూతన సంవత్సరం దేవుని వరమే. కొత్తసంవత్సర బహుమతిగా 'కొత్తదనం' (న్యూనెస్) అనేది కూడా దేవుని బహుమానం, వాగ్దానము అని బైబిల్ మాట్లా డుతుంది. విలాపవాక్యాలు 3:22-23లో మన పట్ల 'దేవునికి అనుదినము నూతనముగా వాత్సల్యత పుట్టుచున్నది' అనే మాటను చూస్తాము. అంటే తమ బిడ్డలపట్ల తల్లిదండ్రులకు ఎలాంటి ప్రేమ రోజురోజు పుడుతుందో అలాంటి ప్రేమే దేవునికి మనపట్ల కలుగుతుంది. కుల, మత, సంఘ, సహవాసం, పేద, గొప్ప, పండితులు, పామరులు, లింగ వివక్ష లేకుండా అందరికీ దేవుడు నూతన సంవత్సరాన్ని బహుమానంగా ఇచ్చాడు. నూతన సంవత్సరం 'దేవుడు ధరింపచేసిన దయా కిరీటము' (కీర్తనలు 65:11) అని కీర్తనకారుడు అంటాడు.

### కొత్తదనం అంటే?

చేసినపనినే చేస్తూ, చూసిందే చూస్తూ, జీవితంలో ఉన్నచోటే ఉంటూ ఎప్పుడూ ఒకేలా ఉంటే

విసుగొస్తుంది, అది జీవితమే కాదనిపిస్తుంది. జీవితం అన్నాక కొంతైనా మార్పు, కొత్తదనం ఉండాలి. కొత్త వస్త్రాలు, కొత్త వస్తువులు, కొత్త ఇల్లు, కొత్త పరిచయాలు, కొత్త అవకాశాలు, కొత్త విషయాలు అంటే మనకు ఎంతో అపురూపం, ఆశ్చర్యం, ఆనందం. మనమందరమూ కొత్తదనాన్ని కోరుకుంటుంటాము! కానీ 'నూతనత్వం' అనే అంశాన్ని మనమెలా అర్థం చేసుకోవచ్చు? 'నూతనత్వం అంటే నూతన సంవత్సర తీర్మానాల తో మన జీవితంలో వచ్చే చిన్న చిన్న మార్పులు కాదు కానీ జీవితంలో పూర్తి పరివర్తన' అని బైబిల్ చెబుతున్నది. గొంగళి పురుగు అందమైన సీతాకోకచిలుకగా రూపాంతరం చెందడం లాంటిది. అలాగే దేవుడు మనుష్యులను యేసు క్రీస్తు లో నూతన పరుస్తాడు. నూతనత్వానికి పునాది దేవుని నూతన సృష్టి కార్యం. పౌలు మాటలలో "కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి, పాతవి గతించెను, ఇదిగో సమస్తమును కొత్తవాయెను" (2 కొరింథీ 5:17). క్రీస్తులో విశ్వాసముంచి, క్రీస్తు నందు ఉన్న వారెవరైనా సరే నూతన సృష్టి, అంతా నూతనమే, పాతదనము గతించింది.

నూతన జీవము పొందాము కాబట్టి నూతనత్వంలో నడుచుకోవాలి (రోమా 6:4). అయితే నీవు క్రీస్తు నందు ఉన్నావా? ఉంటే ఈ కొత్త సంవత్సరమంతా – 12 నెలలు, 52 వారాలు, 365 రోజులు, 8,760 గంటలు, 5,25,600 నిమిషాలు, 31, 536, 000 సెకన్లు అంతా కొత్తదనమే, కొత్త జీవమే, కొత్త సృష్టే. ఆహా మనకు ఎంత భాగ్యము! ఈ భాగ్యముతో పాటు దేవుడు మనల్ని ఈ సంవత్సరమంతా నూతనత్వంలో నడుచుకోవాల్సిన బాధ్యతను కూడా ఇచ్చాడు.

## కొత్తదనం ఏయే విషయాల్లో

క్రీస్తులో నూతన సృష్టిగా చేయబడినవారికి అంతా, అన్ని విషయాలు నూతనమే అంటే ఏంటో తెలుసుకోవాలి.

**కొత్త వ్యక్తులం** – యేసుక్రీస్తును విశ్వసించే ప్రతి వ్యక్తి ఒక కొత్త సృష్టి. కొత్త వ్యక్తిగా జీవితంలో కొత్త దిశ, కొత్త ఆశయాలు, కొత్త ఆశ, కొత్త జీవితం...! విశ్వాసికి అన్నీ కొత్తవే!

**కొత్త భవిష్యత్తు** – అక్షయమైన స్వాస్థ్యము, శాశ్వతమైన భద్రత కలిగిన భవిష్యత్తు మనకు ఉంది.

> 2021వ సం॥ మీకు సక్సెస్‌ని, సంతృప్తిని, సంతోషాన్ని అందించినా లేదా మీరు అపజయాలు, దు:ఖం, ఎదురు దెబ్బలు, కష్టాలు, మరణాలను ఎదుర్కొన్నా, మీరు ఈ 2022 నూతన సంవత్సరంలో నిరీక్షణతో, ఆదరణతో, ప్రభువునందు ఆనందంతో ప్రభువైపు చూస్తూ ఈ జీవిత యాత్రలో సాగిపోవాలి.

**కొత్త ఆహారం** – భౌతిక ఆహారం కాదు, ఆత్మీయ ఆహారం. కొత్త ఆకలి, ఆకలిలో మార్పు (1పేతురు 2:3) దేవుని వాక్యము పట్ల ఆకలి దప్పులు కలిగి ఉంటాం.

**కొత్త విశ్వాసం** – అవసరాలు తెలిసిన దేవునినే సహాయం కోసం అడుగుతూ, ఆశ్రయిస్తాం. ఆయన ప్రార్థన వింటాడని, జవాబు ఇస్తాడని దేవుని విశ్వసిస్తాం.

**కొత్త కుటుంబం** – "తిరిగి జన్మించాం" (దత్తత ద్వారా మార్పు) యేసుక్రీస్తును విశ్వసించడం ద్వారా దేవుని కుమారులం (గలతీ 3 :26), అబద్ధికుని పిల్లలం కాదు కానీ దేవుడే మన తండ్రి, దేవుని కుటుంబానికి చెందినవారం (గలతి 4, ఎఫెసీ 3:14)

**కొత్త సహవాసం** – సరికొత్త సంబంధాలు, స్నేహాలు, సాంగత్యాలు, సహవాసాలు దేవునితో, దేవుని బిడ్డలతో ఏర్పడ్డాయి. బంధాలు, అనుబంధాలలో మార్పు వచ్చింది. "మోసపోకుడి. దుష్టసాంగత్యము మంచి నడవడిని చెరుపును. (1 కొరింథీ 15:33). ఈ లోక స్నేహము, లోకరీతిలో కలిసిపోవడం కొత్తదనానికి పాతదనం అతకటమే. అది దేవునితో వైరమని గుర్తుంచుకోవాలి.

**కొత్త యజమాని /గురువు** – విశ్వాసికి ఒకే ఒక గురువు ఉన్నాడు. ఆయన ప్రభువైన యేసుక్రీస్తు (మత్తయి 23:8-10). మన యజమానుడు,

గురువునైన క్రీస్తుకు నూతన వినయము, విధేయత చూపాలి. చాలామంది విశ్వాసులు అవకాశవాదులుగా ఉంటూ పాత, కొత్త యజమానుల్ని ఇంకా సేవిస్తూనే ఉన్నారు. ప్రభువైన యేసు ఇలా అన్నాడు: "ఎవడూ ఇద్దరు యజమానులకు సేవ చేయలేడు" (మత్తయి 6:24). మనము మన సంపూర్ణ విధేయతను ప్రభుక్రీస్తుకే చూపుదాం.

**కొత్త ఫలం** - కొత్త జీవితానికి గుర్తు ఆత్మ ఫలాన్ని (గలతీ 5:22) ఫలించటం, ఆత్మీయ వరాల్ని ప్రదర్శించడం కాదు - వైఖరిలో మార్పు రావాలి.

**కొత్త పోరాటం** - కొత్త శత్రువు మనకు ఉన్నాడని గుర్తుంచుకోవాలి. దైవభక్తిగల ప్రతి నూతన విశ్వాసికి ముగ్గురు ప్రాథమిక శత్రువులు ఉంటారు- సాతాను, లోకము, శరీరము. ఈ పోరాటంలో ఓడిపోక, శోధనలకు లొంగిపోక, పౌలువలె శరీరాన్ని నలగకొట్టుకొంటూ, ట్రయల్స్ (పరీక్షలను) ఓపికతో సహిస్తూ , ట్రిబ్యులేషన్స్ (శ్రమలను) సంతోషముగా ఎదుర్కొంటూ దేవుని సహాయంతో విజయభేరిని మోగించాలి.

కొత్త జీవితానికి అంతా కొత్తే. కొత్త మనసు-కొత్త దృక్పథం, కొత్త హృదయం-కొత్త కోరికలు, కొత్త ఆత్మ-కొత్త స్వభావం, కొత్త భావోద్వేగాలు, కొత్త గమ్యాలు, సరికొత్త సాహసాలు ప్రభు కొరకు జీవితంలో కొత్తదనం అనుభవించాలంటే నూతన సంవత్సరంలో క్రీస్తు యొక్క నూతనత్వాన్ని స్వీకరించడంలోనే జీవితంలో కొత్తదనం అనుభవించటానికి రహస్యం. ఈ అనుభవం కావాలంటే దేవుని ప్రమేయం, పనితో పాటు మానవ ప్రయత్నం, ప్రయాస కావాలి.

## దేవుని ప్రమేయం

నూతనత్వం దేవుని వాగ్దానం,నూతనక్రియ. 'ఇదిగో నేనొక నూతనక్రియ చేయుచున్నాను ఇప్పుడే అది మొలుచును మీరు దాని నాలోచింపరా?', అని ప్రవక్త ద్వారా దేవుని ప్రకటనను (యెషయా43:18-19) మనం వింటాము. కాలము సంపూర్ణమైనప్పుడు క్రీస్తు ప్రభు ఈ లోకానికి వచ్చి సిలువ మరణము, రక్త ప్రోక్షణ ద్వారా క్రీస్తునందలి నూతనత్వాన్ని అనుగ్రహించాడు. ఇది దేవుని అనుగ్రహమే. పాత సంగతులు గతించి పోయెనని, సమస్తమును నూతనమైనవిగా చేయుచున్నానని, అంతిమ నూతన సృష్టిని గూర్చి దేవుడు యోహాను ద్వారా చేసిన వాగ్దానము (ప్రక 21:5) చేశాడు. పాత రోత సంతతిని పాతి పెట్టాలని క్రీస్తులోని కొత్తదనంతో జీవించాలని దేవుని ఆజ్ఞ.

## మన అనుభవము

దావీదు నాశనకరమైన గుంటలోనుండి, జిగటగల దొంగ ఊబిలోనుండి దేవుడు పైకి లేవనెత్తడాని తన పాత బ్రతుకు గురించి రాసుకొన్నాడు. అంతే కాదు, క్రొత్త పాటను దేవుడు తన నోట నుంచెను అని, అనేకులు దాని చూచి భయభక్తులు గలిగి యెహోవాను నమ్ముతారని తన క్రొత్తదాన్ని పాడాడు (కీర్తన 40వ అధ్యాయం). సమరయ స్త్రీ తన పాత రోత చేష్టలన్ని మాని నూతన జీవితాన్ని ప్రారంభిస్తానని ఊరంతా చాటింది (యోహాను 4 వ అధ్యాయం). ఇలా పేతురు, పౌలు మరెందరో.. ఈ తరములో మనందరి అనుభవం కూడా ఇదే.

## మన పాత్ర

కొత్తదనం దేవుని పని, మన అనుభవం అయినా మనము ప్రేక్షకులం కాదు, ప్యాసివ్ అంతకంటే కాదు. కొత్త, పాత జీవితానికి మధ్య ఎంతో పోరాటం, సంఘర్షణ ఉంటుంది. కొత్తదనాన్ని కలిగివుండడం, దానిలో కొనసాగేందుకు విశ్వాసులు దినదినం ఎంచుకోవాలి. మనము ఎంతో జాగ్రత్తగా, ప్రార్థనతో, వాక్య ధ్యానంతో, పరిశుద్ధుల సహవాసంతో, పరిశుద్ధాత్మానుసారముగా నడుచుకొంటూ, ఆత్మ చేత నడిపింపబడుతూ, ఆత్మననుసరించి జీవిస్తూ ఉన్నప్పుడు పాత రోతను చంపి, పాతి పెట్టుతూ కొత్తదనాన్ని ధరించుకొంటాము. ఒక రోజులో జరిగే పని కాదు, ప్రతిరోజు సంవత్సరమంతా, ఈ లోకంలో మనం జీవించినంతకాలం, ప్రభువు వచ్చే వరకు ఈ నూతనత్వాని ధరించుకొని దానిని అనుభవించాలి.

## విడిచిపెట్టాల్సినవి-ధరించుకోవాల్సినవి

నూతనత్వంలో నడవడానికి పాతజీవితాన్ని విడిచిపెట్టి, కొత్త జీవితాన్ని ధరించుకోవాలి. పౌలు పత్రికలలో (ఎఫెసీ 4:22-24; కొలస్సీ 3:9-10, ఫిలిప్పీ 3:13-14) క్రీస్తులో నూతనత్వం గూర్చి బోధించాడు. కొలస్సీ పత్రికలో నూతనపరచబడుతున్న నూతన స్వభావము ధరించుకొన్నారు అని ఎఫెసీ పత్రికలో నూతన స్వభావము ధరించుకోవాలని స్పష్టముగా వివరించాడు.



పాతచొక్కా పారేసి కొత్త చొక్కా వేసుకోవాలనే పోలిక సూచించాడు. ఈ క్రమంలో వదిలిపెట్టాల్సినవి, ధరించుకోవాల్సినవాటి గూర్చి తెలుసుకొందాం

## వేటిని విడిచిపెట్టాలి?

మోసకరమైన దురాశవలన చెడిపోయే ప్రాచీనస్వభావాన్ని, మంటినుండి పుట్టినవాని పోలికను, సకలమైన దుష్టత్వాన్ని, మోసకరమైన దురాశవలన చెడిపోయి పాతస్వభావముతో ఉన్న మురికిని పాత చొక్కా తీసి పారేసినట్లు పారేసి, పాతిపెట్టాలి.

కోపము, క్రోధము, ఆగ్రహము, సమస్తమైన ద్వేషము, దూషణ, దుర్భాష, బూతులు, పోకిరి మాటలు, డంబాలు, గొప్పలు, అల్లరి, ముసలమ్మ ముచ్చట్లు దుష్ట సాంగత్యము-చెడు స్నేహాలు, సహవాసాలు, సంబంధాలు, అక్రమ సంబంధాలు - వివాహానికి ముందు, వివాహేతర సంబంధాలు, అమ్మాయిలు-అమ్మాయిలు, అబ్బాయిలు-అబ్బాయిలు మధ్య ఉండే అవాంఛనీయ సంబంధాలు, లైంగిక వికారాలు, కామ, క్రోధ,మద, మాత్సర్యాలు కలహములు, సోమరితనం, దొంగిలించడం, ఒకనితో ఒకడు అబద్ధాలు, సణుగుడు, సంశయాలు, నటన, పైపై భక్తి, అపవాదికి చోటు ఇవ్వడము, పరిశుద్ధాత్మను దు:ఖపెట్టడం.. మొదలైన వాటన్నిటినీ విసర్జించాలి.

## వేటిని ధరించుకోవాలి?

నీతియు, యథార్థమైన భక్తియుగలవారై, దేవుని పోలికగా సృష్టింపబడిన నవీనస్వభావమును ధరించుకోవాలానే ఆజ్ఞకు అనుగుణంగా క్రీస్తు ఇచ్చే అందమైన రంగు రంగుల శుభ్రమైన, పాతబడని నిత్య నూతన కొత్త చొక్కాను ధరించాలి. అలాగే దేవునిగూర్చిన జ్ఞానము, పరలోకసంబంధి పోలిక, ప్రభువు పనియందు ఆసక్తి, నూతనపరచబడిన చిత్తము, జాలిగల మనస్సును, కరుణాహృదయం, దయాళుత్వమును, దీర్ఘశాంతమును, వినయమును, సాత్వికమును, నీతిప్రవర్తనను ధరించుకోవాలి.

ప్రతివాడును తన పొరుగువానితో సత్యమే మాట్లాడాలి, క్షేమాభివృద్ధికరమైన అనుకూలవచనమే పలకాలి, ఎదుటివారు హానిచేసినా ఒకనినొకడు సహించుచు ఒకనినొకడు ప్రభువు మనల్ని ఎలా క్షమించాడో అలా క్షమించాలి. ఒకని యెడల ఒకడు దయకలిగి ఉండాలి. వీటన్నిటిపైన పరిపూర్ణతకు అనుబంధమైన ప్రేమను కలిగి ప్రతిరోజు ప్రభువులో కొత్తగా జీవించాలి.

2021వ సం॥ మీకు సక్సెస్‌ని, సంతృప్తిని, సంతోషాన్ని అందించినా లేదా మీరు అపజయాలు, దు:ఖం, ఎదురు దెబ్బలు, కష్టాలు, మరణాలను ఎదుర్కొన్నా, మీరు ఈ 2022 నూతన సంవత్సరంలో నిరీక్షణతో, ఆదరణతో, ప్రభువునందు ఆనందంతో ప్రభువైపు చూస్తూ ఈ జీవిత యాత్రలో సాగిపోవాలి. ఎందుకంటే." నేను మిమ్మునుగూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును, రాబోవు కాలమందు మీకు నిరీక్షణ కలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములేగాని హానికరమైనవి కావు; ఇదే యెహోవా వాక్కు" (యిర్మీయా:29:11) అని దేవుడు వాగ్దానం చేశాడు.

దేవా! ఈ నూతన సంవత్సరంలో నన్ను నూతన పరచుము, నీ నూతన కార్యాలు నా యెడల జరిగించుమని ప్రతిరోజు ప్రార్థన చేసుకొందాం.

"ప్రతిరోజు ఒక కొత్త రోజు
ముందెన్నడూ రాలేదు ఈ రోజు
మరెన్నడు రాబోదు ఈ రోజు
ప్రత్యేకమైన కొత్త రోజు
ఆనందముగా జీవించాలి ఈ రోజు
క్రీస్తు కొత్తదనము ధరించాలి ప్రతి కొత్త రోజు
ప్రతి కొత్త రోజు ప్రభువుకు మహిమే..."

అని పాడుకొంటూ, ప్రార్థనచేసుకొంటూ కొత్తదనంతో జీవిస్తూ ఈ సంవత్సరమంతా సాగిపోదాం.

**- డా. జె. రత్నగ్రేస్,** వైజాగ్



# నూతన సృష్టి

*"కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి" (2 కొరింథీ 5:17)*

ఒక ఊరిలో ఒక పెద్ద పురాతనమైన భవనం శిథిలావస్థలో ఉన్నది. దానిని దగ్గరగా గమనిస్తే, ఒకప్పుడుదాన్ని గొప్ప నైపుణ్యం కలిగిన శిల్పులు నిర్మించారని ఇట్టే అర్థమౌతుంది. కానీ అదిప్పుడు శిథిలావస్థలో ఉన్నది. ఒకరోజు వేరే ఊరి నుండి గొప్ప ధనవంతుడు ఆ గ్రామాన్ని దర్శించడానికి వచ్చి, ఆ పురాతన భవనాన్ని చూసి, ముచ్చటపడి దానిని కొన్నాడు. అంతేకాదు, చాలా ధనాన్ని ఖర్చు చేసి ఆ భవనాన్ని ఎంతో సుందరంగా తీర్చి దిద్దాడు. ఒకప్పుడు దాన్ని చూసిన వారు ఎంతో బాధపడేవారు, కానీ ఇప్పుడు దాన్ని చూస్తూ ఎంతో ఆశ్చర్యంతో దాని వైభవాన్ని బట్టి సంతోషిస్తున్నారు. ఇప్పుడది అనేకమందిని ఆకర్షిస్తుంది. నూతనమైన భవనాలు, నూతనమైన వస్తువులు, నూతనమైనవి ఏవైనా అనేకుల్ని ఆకర్షిస్తాయి.

దేవుని పోలికలో సృష్టించబడిన మానవుడు దేవుని ఆజ్ఞను మీరి, పాపం చేసి దేవునికి దూరమై పతనమైయ్యాడు. ఆధ్యాత్మికంగా శిథిలమైన స్థితిలో ఉన్నాడు. మానవుని పాపం కారణంగా తనతోపాటు, భూమిలోని ప్రకృతి, సృష్టి అంతా పాపబంధకాలలో చిక్కుకొని, శాపానికి గురైంది. ఇలాంటి స్థితిలో ఉన్న సృష్టిని దేవుడు విమోచించాలనుకున్నాడు. ఆ విమోచనను క్రీస్తు ద్వారా, మానవునితో ప్రారంభించాడు.

"కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి" (2 కొరింథీ 5:17).

'ఎవడైనను' అనే పదం విశ్వమానవాళికి దేవుడిస్తున్న ఒక గొప్ప ఆహ్వానం, వాగ్దానం. ఈ భూమి మీద నివసిస్తున్న ప్రతి ఒక్కరికీ, వారు ఏ దేశానికి చెందినవారైనా, వారి జాతి, మత, సంస్కృతి, నేపథ్యాలు ఏవైనాసరే, దేవుడు సిద్ధపరచిన ఈ నూతన సృష్టిలో భాగమయ్యేందుకు అవకాశాన్ని, ఆహ్వానాన్ని దేవుడు ఇస్తున్నాడు.

'క్రీస్తునందున్న యెడల'... క్రీస్తును విశ్వసించిన అందరికీ వర్తించే వాగ్దానం ఇది. క్రీస్తుప్రభువు

తమ పాపాల కోసం మరణించాడని విశ్వసించి, ఆయనలో ఉన్నవారందరికీ పాపక్షమాపణ, పాపం నుండి విమోచన, నిత్యజీవం, నిత్య భద్రతతోపాటు, తన పాపం మూలంగా మానవుడు కోల్పోయిన దేవుని స్వభావ లక్షణాలను పోలిన ఒక నూతన స్వభావాన్ని దేవుడు క్రీస్తును విశ్వసించిన వారందరిలో సృష్టించాడు.

దేవుడు ఉద్దేశించిన 'నూతన సృష్టికి' ప్రారంభం, విశ్వాసిలో దేవుడు ఆరంభించిన ఈ నూతన స్వభావమే. నూతన సృష్టికి ప్రారంభం ఇదే.

విశ్వాసిలో దేవుడు ప్రారంభించిన ఈ నూతన సృష్టికి సంబంధించిన కొన్ని ప్రాముఖ్యమైన విషయాలేమిటో నేర్చుకొందాం.

## 1. నూతన యాజమాన్యం

ఈ సృష్టి అంతటికీ సృష్టికర్త, ప్రభువు, యజమాని దేవుడే అయినప్పటికీ, మానవుని పాపం సృష్టిని ముఖ్యంగా మానవుని ఎంతో ప్రభావితం చేసింది. తొలిమానవుడైన ఆదాము తన పాపం మూలంగా దేవుడు అనుగ్రహించిన స్వేచ్ఛాజీవితం నుండి, దేవుని ఆధిపత్యం నుండి దూరమై పాపానికి, సాతానుకు దాసుడై వారి యాజమాన్యంలోనికి వెళ్ళిపోయాడు. ఆదాము సంతానమైన మనమందరం కూడా ఈ యాజమాన్యంలోనే ఉంటూ పాపానికి బానిసలుగా ఉన్నాము. అయితే, క్రీస్తు ప్రభువును విశ్వసించుట ద్వారా మన యాజమాన్యం మారిపోయింది. ఆయన తన రక్తం ద్వారా మనల్ని కొనుక్కున్నారు. పాప యాజమాన్యం నుండి మనల్ని విడిపించి, తన వారిగా చేసుకొన్నారు. ఇప్పుడు మనం క్రీస్తుకు సంబంధించిన వారము. మన యజమానుడు క్రీస్తు.

క్రీస్తుప్రభువు యాజమాన్యంలో జీవించడం అంటే ఏమిటి? క్రీస్తుప్రభువులో మనం కొనసాగడం. ఆయనను ప్రేమించడం. మన కోరికలను, ఇష్టాలను ఆయన కోసం త్యాగం చేసి, ఆయన ఇష్టాలకు, ప్రణాళికలకు అనుగుణంగా జీవించడం. ఆయన మన యజమానుడు కాబట్టి, ఆయనకు తెలియకుండా, చెప్పకుండా ఏమీ చేయకూడదు. మన పట్ల ఆయనకున్న ప్రణాళికలను వాక్యాన్ని వాక్య ధ్యానం, ప్రార్థన, విశ్వాసుల సహవాసం ద్వారా తెలుసుకొని, ఆయనకు నమ్మకమైన వ్యక్తిగా జీవించడం. క్రొత్తనిబంధన కాలంలో జీవించిన



అపొస్తలులు, నాయకులు, విశ్వాసులు తమను తాము క్రీస్తు దాసులుగా పరిగణించుకొని ఆయన కోసం తమ జీవితాలను త్యాగం చేశారు. మనం కూడా వారి మాదిరిని అనుసరించడం ఎంతో ఆశీర్వాదకరం.

## 2. నూతన ప్రారంభం

సుంకపు గుత్తదారుడైన జక్కయ్య యేసుక్రీస్తును విశ్వసించిన తర్వాత అతనిలో గొప్ప మార్పు ప్రారంభమైంది. దేవుని పట్ల, ధనం పట్ల, ఇతరుల పట్ల అతనికి ఉన్న దృక్పథాలన్నీ మారిపోయాయి (లూకా 19:1-10). క్రీస్తు ప్రభువును విశ్వసించిన వారందరిలో ఈ నూతన ప్రారంభం కనిపిస్తుంది. దేవుడు మనలో ఒక నూతన స్వభావాన్ని సృష్టించాడని, మనం నూతన సృష్టిగా మారామని చెప్పడానికి ఈ నూతన ప్రారంభం ఒక రుజువు.

క్రీస్తును విశ్వసించిన మన అందరిలో ఈ నూతన జీవితాన్ని, జీవిత విధానాన్ని ప్రారంభించింది దేవుడే. దానిని కొనసాగించేది దేవుడే. "మీలో ఈ సత్క్రియ నారంభించినవాడు యేసుక్రీస్తు దినము వరకు దానిని కొనసాగించునని రూఢిగా నమ్ముచున్నాను" (ఫిలిప్పీ 1:3-6). అయితే, మన బాధ్యత కూడా ఉన్నది. ప్రభువు పట్ల మనకు ప్రారంభంలో ఉన్న ప్రేమ, ఆసక్తులను కొనసాగించటానికి మనం గట్టి తీర్మానం చేసుకోవాలి. క్రీస్తుప్రభువును విశ్వసించకమునుపు మనకు ఉన్న విలువలు, ప్రాధాన్యతలు, నమ్మకాలను, దేవుని వాక్యానికి అనుగుణంగా మార్చుకొంటూ, అవసరమైతే, వాటిని వదులుకొంటూ మనం ముందుకు సాగిపోవాలి.

## 3. నూతన పౌరసత్వం

ఒక రాజ్యంలో గాని దేశంలోగాని నివసించే ప్రజల

**అవిశ్వాసులతో చేసే స్నేహానికి పరిధుల ను ఏర్పరచుకోవడం చాలా ముఖ్యం. లేకుంటే, మనం శోధించబడి, శోధనలకు లొంగి, చల్లారిపోయి, వారిలో కలిసిపోయి, మనల్ని మనం లేదా మనం ఎవరిమో మర్చిపోయే ప్రమాదం ఉన్నది. కాబట్టి వారితో గాఢమైన స్నేహాన్ని కలిగి ఉండడం అంత ఆదర్శవంతం కాదు, అది చాలా రిస్క్ కూడా. వారితో వివాహ సంబంధాల ను ఏర్పరచుకోవడం ఎంతో ప్రమాదం. దేవుని వాక్యానికి విరుద్ధం.**

ను లేదా ఒక రాజ్యం లేదా దేశానికి సంబంధించిన ప్రజలను ఆ దేశపౌరులని పిలుస్తారు. వారి పేర్లు ఆ దేశ పౌర పట్టికలో నమోదై ఉంటాయి. వారు ఆ దేశ వనరులు మొ॥న వాటన్నిటికీ హక్కుదారులు. వారి పౌరసత్వం వారికి గుర్తింపు, హోదా, హక్కుల ను, భద్రతను ఇస్తుంది. అంతేకాదు, ప్రతీ పౌరునికి కొన్ని బాధ్యతలు కూడా ఉంటాయి.

క్రీస్తుప్రభువును విశ్వసించిన మనమందరం దేవుని రాజ్య సంబంధులం. దేవుని రాజ్య పౌరులం, దేవుని వారుసులం. మనం ఈ లోక రాజ్యసంబంధులం కాదు "మీరు పరదేశులు ను యాత్రికులునై ఉన్నారు..." (1 పేతురు 2:11). "ఆయన మనల ను అంధకారసంబంధమైన అధికారంలో నుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులనుగా చేసెను" (కొలస్సీ 1:13). మన పౌర స్థితి పరలోకమందున్నది. అక్కడ నుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుచున్నాము (ఫిలిప్పీ 3:20). క్రీస్తు రాజ్య సంబంధులమైన మనమందరం ఎంతో గొప్ప ధన్యులం. సాతాను రాజ్యంలోని మన పేర్లను తుడిచివేసి, వాటిని ఆయన రాజ్యపుటలో లిఖించాడు. అవి ఎన్నటికీ చెరిగిపోవు; దేవుని రాజ్య పౌరులమైన మనకు కొన్ని బాధ్యతలు కూడా ఉన్నాయి. మనం క్రీస్తు ప్రభువు రాయబారులము (2 కొరింథీ 5:20). ఈ లోకంలో మనం ఆయన ప్రతినిధులము. ఆయన ప్రతినిధులుగా ఈ లోకంలో జీవిస్తూ, ఆయన సువార్తను చేతబట్టుకొని, ప్రతి మనిషికీ ఆయన సువార్తను తెలియజేసి, సువార్త విశ్వసించి, దేవునితో సమాధానపడమని వారిని బ్రతిమాలవలసిన, గొప్ప భారంతో వారి కోసం ప్రార్థించాల్సిన బాధ్యత మనమీద ఉన్నది.

### 4. నూతన సంబంధాలు, సహవాసం

#### తోటి విశ్వాసులతో

ప్రభువైన యేసుక్రీస్తును విశ్వసించడం ద్వారా మనం దేవుని పిల్లలమైనాము (యోహాను 1:12). ఆయనతో మనకు సంబంధం ఏర్పడింది. అలాగే మనవలె క్రీస్తును విశ్వసించిన వారితో కూడ మనకు సంబంధం ఏర్పడింది. ఈ రెండు నూతన సంబంధాలు ఎన్నటికీ తెగిపోవు. అవి ఎంతో దివ్యమైనవి, నిత్యమైనవి, పరలోక సంబంధమైనవి. దేవునితోను, దేవుని బిడ్డలతోను అన్యోన్య సహవాసాన్ని అభివృద్ధి చేసుకొనుట ద్వారా ఆ సంబంధాలలో ఉన్న మాధుర్యాన్ని అనుభవించగలం. వ్యక్తిగత ప్రార్థన, వాక్యధ్యానం, సామూహిక వాక్య అధ్యయనం, ప్రార్థనలు, దేవునితోనూ, దేవుని ప్రజలతోనూ మనకు ఏర్పడిన ఈ నూతన సంబంధాలలోని మాధుర్యాన్ని అనుభవించేందుకు సహాయపడే సాధనాలు. కాబట్టి వీటిని ఎన్నడూ నిర్లక్ష్యం చేయకూడదు. వీటి పట్ల అనాసక్తిని కలిగి ఉండకూడదు.

స్వార్థం, గర్వం, అహం మొదలైన పాతస్వభావానికి సంబంధించిన వాటికి మన జీవితంలో చోటిస్తే మన తోటి దేవుని బిడ్డలతో మనకు ఉండే సహవాసాన్ని పాడు చేసుకున్న వారిమౌతాము. సహవాసంలో అనైక్యతకు బీజం వేసిన వారమౌతాము. ఇది దేవుని దు:ఖపరచే విషయం (ఎఫెసీ 4:25-32).

#### అవిశ్వాసులతో

ఈ లోకంలో మనం జీవించినంతకాలం క్రీస్తును విశ్వసించని ఇతరులతో కూడా మనం స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించాల్సి ఉంటుంది. మనం క్రీస్తు ప్రభువు రాయబారులం కదా. వారికి సువార్తను తెలియజేసి, క్రీస్తుప్రభువును విశ్వసించి, దేవునితో సమాధానపడమని వారిని బ్రతిమాలాడల్సింది మనమే కదా. వారితో స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉండకపోతే ఇది ఎలా సాధ్యం? అయితే,

ఇక్కడ ఒక ప్రమాదం లేకపోలేదు. అవిశ్వాసులతో చేసే స్నేహానికి పరిధులను ఏర్పరచుకోవడం చాలా ముఖ్యం. లేకుంటే, మనం శోధించబడి, శోధనలకు లొంగి, చల్లారిపోయి, వారిలో కలిసిపోయి, మనల్ని మనం లేదా మనం ఎవరిమో మర్చిపోయే ప్రమాదం ఉన్నది. కాబట్టి వారితో గాఢమైన స్నేహాన్ని కలిగి ఉండడం అంత ఆదర్శవంతం కాదు, అది చాలా రిస్క్ కూడా. వారితో వివాహ సంబంధాల ను ఏర్పరచుకోవడం ఎంతో ప్రమాదం. దేవుని వాక్యానికి విరుద్ధం.


### 5. నూతన ప్రవర్తన, అలవాట్లు

"కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతనసృష్టి. పాతవి గతించెను, ఇదిగో సమ-స్తమును క్రొత్తవాయెను". "క్రొత్తవాయెను" అనే పదం భూతకాలాన్ని తెలియజేసేదిగా ఉన్నప్పటికీ, గ్రీకులో "ఈ క్రొత్తదనం కొనసాగుతూ ఉంటుంది" అని అర్థమిచ్చే పదాన్ని వాడడం జరిగింది. అంటే, క్రీస్తును విశ్వసించిన ప్రతి విశ్వాసి దృక్పథాలలో, ఆలోచనలలో, తాను ఆయా విషయాలను చూసి, గ్రహించే విషయాలలో గొప్ప మార్పు కలుగుతుంది. ఈ మార్పు అతని/ఆమె అలవాట్లు, ప్రవర్తనలో మార్పును తీసుకొస్తుంది. ఈ మార్పు కొనసాగుతూ ఉంటుంది. మనం మహిమలో ప్రవేశించేంతవరకు కొనసాగుతూ ఉంటుంది. ఈ నూతనత్వం అక్కడ పరిపూర్ణమౌతుంది.

లోకసంబంధమైన విషయాల పట్ల మన దృక్పథం మారింది. నూతన సృష్టిగా మారినంతమాత్రాన మనం సంపూర్ణులం కాలేదు. పుట్టుకతో మనకు వచ్చిన పాపస్వభావం మనలో ఇంకా ఉన్నది. మనం దానితో ప్రతిరోజూ పోరాడి, జయించాల్సి ఉంటుంది. అలవాట్లను దేవుని సహాయంతో ఎదిరిస్తూ, నూతనత్వంలో ఎదుగుతూ జీవించాలి. అప్పుడే, క్రీస్తు రాయబారులముగా జీవించగలుగుతాము. "మనము కూడా ప్రతిభారమును, సుళువుగా చిక్కులపెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచూ, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము" (హెబ్రీ 12:2).

### 6. నూతన నిరీక్షణ

"ఇందును గూర్చిదేవుడు తన్ను ప్రేమించువారి కొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు,




చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరముకాలేదు అని రాయబడియున్నది."(1 కొరింథీ 2:9).

మనం ఈ లోకంలోనూ, పరలోకంలో జీవించే జీవితాలకోసం దేవుడు సిద్ధపరచిన అద్భుతమైన ఆశ్చర్యకరమైన విషయాలను ఈ వచనం ద్వారా పౌలు వర్ణిస్తున్నాడు. యేసుక్రీస్తు ప్రభువును విశ్వసించిన మనమందరం మరణించిన తర్వాత పరలోకంలో దేవునితో నిత్యము జీవిస్తాము. అప్పటివరకు పరిశుద్ధాత్మ దేవుడు మనల్ని ఈ లోకంలో ఆదరిస్తాడు నడిపిస్తాడు. అద్భుతమైన భవిష్యత్తు మనకు ఉన్నదని తెలియజేస్తున్న ఈ వాగ్దానం, ఈ లోకంలో మనకు ఎదురయ్యే కష్టనష్టాలు అన్నిటిని ధైర్యంగా ఎదుర్కొంటూ నిరీక్షణతో ముందుకు సాగటానికి మనల్ని బలపరుస్తుంది. గొప్ప నిరాశను కలిగించే పరిస్థితులు మనకు ఎదురైనప్పటికీ మనం నిరీక్షణతో జీవించటానికి ఈ వాగ్దానం మనకు సహాయపడుతుంది.

ఇంత గొప్ప నిరీక్షణను కలిగి ఉన్న మనము ఈ లోకంలో పరలోకపు విలువలతో జీవించాలి. ఆయన వాక్యాన్ని ధ్యానిస్తూ, అనుసరిస్తూ ఈ లోకంలో జ్యోతులుగా ప్రకాశిస్తూ, చీకటిలో ఉన్న, దేవుని ఉగ్రతకు పాత్రులైన అనేకులను క్రీస్తులోని ఈ నిరీక్షణలోనికి నడిపించుటకు ప్రయాసపడదాం.

### 7. నూతన లక్ష్యం

క్రీస్తు ప్రభువును విశ్వసించకమునుపు మనలోని

ప్రతి ఒక్కరికి ఈ లోకసంబంధమైన అనేక లక్ష్యాలు, అభిరుచులు, ఆశయాలు, ధ్యేయాలు ఉండేవి. క్రీస్తును విశ్వసించడం ద్వారా మన జీవితానికి ఉన్న అర్థాన్ని, పరమార్థాన్ని గ్రహించాము. మనం ఈ లోకంలో జీవిస్తున్నది, జీవించాల్సింది మన ఆశయాల కోసం కాదు, మన లక్ష్యాలను సాధించడం కోసం కాదు. మనల్ని నూతన సృష్టిగా మార్చిన మన ప్రభువైన యేసుక్రీస్తు మనపట్ల కలిగి ఉన్న ఉద్దేశాలను నెరవేర్చడంకోసం, వాటిని ఈ లోకంలో సమర్థవంతంగా నెరవేర్చడమే మన జీవిత ఆశయం. ఒక్క మాటలో చెప్పాలంటే, క్రీస్తు ప్రభువును ప్రేమించడం, క్రీస్తు ప్రభువుకోసం జీవించడం, ఇదే మన జీవిత ధ్యేయం, లక్ష్యం. "నేను క్రీస్తుతో కూడా సిలువ వేయబడియున్నాను. ఇకను జీవించువాడను నేను కాను. క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్నుతాను అప్పగించుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసమువలన జీవించుచున్నాను" (గలతీ 2:20). "... క్రీస్తు నామమెరుగని చోట్లను సువార్తను ప్రకటింపవలెనని మిక్కిలి ఆశగలవాడనైయుండి ఆలాగున ప్రకటించితిని" (రోమా 15:21). పై రెండు వచనాలు అపోస్తలుడైన పౌలు జీవిత లక్ష్యాలుగా మనకు కనిపిస్తున్నాయి. మనం కూడా పౌలువలె జీవిద్దామా?

### ముగింపు

క్రీస్తును విశ్వసించిన మనమందరం దేవుని నూతన ప్రజలం. పరిశుద్ధాత్మ దేవుడు మనకు నూతన జీవితాన్ని ఇచ్చాడు. మనల్ని నూతన సృష్టిగా మార్చాడు. నూతన సంబంధాలను, నూతన నిరీక్షణను, నూతన లక్ష్యాన్ని ఇచ్చాడు. దేవుడు మనకు అనుగ్రహించిన మరొక నూతన సంవత్సరంలో ఈ నూతన జీవితంలో మరి ఎక్కువ పరిపక్వతలోనికి ఎదగడానికి, క్రీస్తురాయబారులుగా మన నూతన లక్ష్యాలను మరింత సమర్థవంతంగా నెరవేర్చగలిగేటట్లు తీర్మానించుకొందామా? దేవుని కృప మనందరికీ తోడైయుండును గాక. నూతన సంవత్సర శుభాకాంక్షలతో...

**– పి. రామస్వామి,** దర్శి

## Crossword Puzzle

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | 3 | | | | | 4 |
| 5 | | | | | | 6 | | |
| | | | | | | | | |
| | | | 7 | | | | | |
| | | | | | | | | |
| | | | 8 | | | | | |
| | | 9 | | | | | | |
| | | | 10 | | | | | |

**Horizontal**
1. The man who gave his grave to Jesus.
7. The second and greatest of Israel's kings.
8. A son of Pahatmoab who put away his foreign wife.
9. Son of Methusael of the race of Cain, who had two wives Adah, Zilla.
10. One of the Bene-Hari, who married a foreign wife.

**Vertical**
2. The man who became an outcast, who was not his father's heir.
3. The man who was a virtuaous patriot.
4. The gand son of Levi, having 3 children, who diet at 137 years of age.
5. One of the two Chamberlains, whose plot against the king was discovered n deceived.
6. The symbolic name of Jerusalem, whose two sons were slain by Benaiah.





*Please find out the hidden words in the puzzle using the clues/hints and send to Nambur office within 15 days.*

**Last month key:**

| | | | | | |
|---|---|---|---|---|---|
| J | A | B | E | Z | H |
| J | P | C | | | A |
| O | O | A | A | | M |
| E | L | I | S | H | A |
| L | L | N | H | | R |
| G | O | M | E | R | K |
| | S | E | R | E | D |

1. *M. Ankarao, Guntur*
2. *T. Anand Babu & Koteswari, Chilakaluripet*
3. *R. Suma Srinivas, Staff, Tirupathi*

# నూతన కార్యాల కొరకు ఆహ్వానము



*"యెహోవా సంవత్సరములు జరుగుచుండగా
నీ కార్యములు నూతనపరచుము".*
– హబక్కూకు 3:2

గత రెండు సంవత్సరాలుగా మనం ఎన్నో గడ్డు పరిస్థితుల గుండా వెళ్ళినప్పటికీ దేవుడు ఎంతో కృప చూపుతూ వచ్చాడు. నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న మనం నూతన ఉత్సాహంతో, నిరీక్షణతో ఎలా ఉండబోతుందో అన్న కొద్దిపాటి సంశయంతో ఎదురుచూస్తున్నాము. ప్రవక్తయైన హబక్కూకు రాబోవు రోజుల్లో, సంవత్సరాల్లో ప్రభువు జరిగించబోయే నూతన కార్యాల కోసం ఎదురుచూస్తూ 3:2లో వాటికి ఆహ్వానం పలుకుతున్నాడు. నూతన సంవత్సర ఆరాధనలో సాధారణంగా ఈ వాక్యాన్ని ఆధారం చేసుకొని రానున్న రోజులలో ప్రభువు నూతన ఆశీర్వాదాలు, అన్నీ మంచి రోజులు ఇవ్వబోతున్నాడనే మాటలు వింటుంటాము. అయితే వాక్య సందర్భాన్ని, అర్థాన్ని పరిశీలిస్తే ప్రవక్తయైన హబక్కూకు రాబోయే రోజుల్లో, సంవత్సరాల్లో భయంకరమైన శ్రమ దినాలు రాబోతున్నాయని తెలిసి కూడా పూర్ణ హృదయముతో వాటి కోసం ఎదురుచూస్తూ స్వాగతిస్తున్నాడు. మొదట హబక్కూకు కూడ వాటిని వ్యతిరేకించి, ప్రశ్నించినప్పటికి ప్రభువు రెండవ అధ్యాయంలో మాట్లాడిన మాటలను బట్టి సంపూర్ణంగా అంగీకరించాడు.

### 1. హబక్కూకు మొదటి స్థితి

#### ఎ. ప్రభువు మౌనంగా ఉండటం సహించలేకపోయాడు

ఆయన పేరు పెట్టబడిన ఆయన ప్రజలు భయంకరంగా పాడైపోతున్నారు. బలహీనులపై దోపిడి, అక్రమం జరుగుతుంది. అయినప్పటికి ప్రభువు పట్టించుకోవటం లేదని, మౌనంగా ఉన్నాడని ఆయనను ప్రశ్నిస్తున్నాడు.



దేవుడు నీకు ఇంకొన్ని రోజులు, సంవత్సరాలు ఇచ్చాడు అంటే అవి నీవి కాదు. నీ సమయం, నీ కుటుంబం, నీ పని, నీవు చేసేవన్నీ ఖచ్చితంగా ఆయనను మహిమపరచేవిగా ఉండాలి

– ఎ.డబ్ల్యు టోజర్

మనం కూడా క్రైస్తవ జీవితంలో మన ప్రార్థనలకు జవాబు రానప్పుడు, సమస్యలు కొనసాగుతున్నప్పుడు ప్రభువు పట్టించుకోవడం లేదు, మౌనంగా ఉన్నాడన్న అపోహలో ఉంటాము కాని, ఆయనకు అన్నీ తెలుసు. ఆయన సమయంలో వాటిని జరిగిస్తాడని ప్రభువు కోసం ఎదురుచూడలేకపోతున్నాము.

### బి. దేవుని ప్రజల దుష్టస్థితిని బట్టి ఆందోళన చెందాడు

దేవుని బిడ్డలు ధర్మశాస్త్రమును పక్కనబెట్టి వాళ్ళకు ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు. ఆయన కోసం పవిత్రంగా, ప్రత్యేకంగా బ్రతకడం మర్చి పోయి, విచ్చలవిడిగా బ్రతుకుతున్నారు. వీటిని బట్టి హబక్కూకు ధర్మశాస్త్రం నిరర్థకమయ్యింది, ప్రభువు శక్తి వాళ్ళ మధ్య పనిచేయడం లేదు అన్న ఆందోళన, నిరాశతో ఉన్నాడు.

మనం కూడ పరిచర్యలో ఫలం చూడనప్పుడు, ఇతరులలో వృద్ధి చూడనప్పుడు నిరుత్సాహపడి ప్రభువును, ప్రభు పనిని సందేహిస్తాము. పరి స్థితులు ఎలా ఉన్నా ఆయన శక్తి తగ్గదు అని గర్తుంచుకోము.

### సి. దేవుడు అన్యాయంగా ప్రవర్తిస్తున్నాడు అని భావించాడు

దేవుడు వాళ్ళందరి దుష్టస్థితిని బట్టి వారి మీదికి బబులోను రాజును పంపిస్తాను అని, వాళ్ళు వచ్చి దేశాన్ని నాశనం చేసి, ప్రజలను చెరగా తీసుకువెళ్తారని చెప్పినప్పుడు హబక్కూకు దానిని సహించలేకపోయాడు. దానిని అన్యాయంగా భావించి ఆయనను తిరిగి ప్రశ్నిస్తున్నాడు. "వాళ్ళు మాకంటే ఘోరమైన పాపులు, మమ్మల్ని శిక్షించడానికి వాళ్ళను ఎలా వాడుకుంటావు" అని. ఆయన దగ్గర నుంచి ఇలాంటి సమాధానం హబక్కూకు ఊహించలేదు. ఊహించని శ్రమ రాబోతుందని ఆవేదన చెందాడు.

మనం కూడా మన వ్యక్తిగత, కుటుంబ, సంఘ, సామాజిక జీవితంలో ఊహించనివి జరిగినప్పుడు వాటిని బట్టి ప్రభువు మనకు అన్యాయం చేస్తున్నాడని అనుకుంటుంటాము. మనకు ప్రియమైన వ్యక్తులను కోల్పోయినప్పుడు, ఎదురుచూస్తున్న ఉద్యోగం లేక ఆశీర్వాదాలు రానప్పుడు, వివాహం జరగనప్పుడు, అనారోగ్యం ఏర్పడినప్పుడు దేవుడు నాకు అన్యాయం చేశాడు అని భావిస్తాము. కానీ ఆయన ఎప్పుడు అన్యాయస్థుడు కాదు వాటిని అనుమతించడంలో ఆయన ఉద్దేశాలు ఉన్నాయి.

హబక్కూకులాగ మనం కూడ క్రైస్తవ జీవితంలో అన్నీ ఆశీర్వాదాలే అని, కష్టాలు, శ్రమలు ఉండవని, తప్పకుండా మంచి ఉద్యోగం వస్తుందని, ఆర్థికంగా ఉన్నతస్థాయికి ఎదుగుతాము అని తప్పుడు అపోహలో బ్రతుకుతూ, ఊహించనివి జరిగినప్పుడు వాటిని భరించలేకపోతున్నాము, వాటిని అంగీకరించలేకపోతున్నాము.

## 2. అంతిమంగా రాబోవు శ్రమను అంగీకరించడానికి కారణాలు

ఆవేదనతో, ఆందోళనతో ఉన్న హబక్కూకు, రెండవ అధ్యాయంలోని దేవుని సమాధానము అతని అభిప్రాయాలను, ప్రవర్తనను మార్చివేసింది. దేవుని న్యాయాన్ని దేవుని సార్వభౌమాధికారాన్ని సందేహిస్తున్న ప్రవక్తకు సమాధానం, నెమ్మది, నిరీక్షణను ఇచ్చింది.

## దేవుడు గుర్తు చేసిన మూడు ముఖ్యమైన విషయాలు

### ఎ. దేవుని న్యాయం, తీర్పు

మాకంటే ఘోరమైన పాపులను మామీదకు ఎలా రప్పిస్తావు అన్న ప్రశ్నకు దేవుడు ప్రతిస్పందిస్తూ, వాళ్ళలో ఎలాంటి వారు ఉన్నారో అది ఆయనకు తెలుసని, వారికి కూడ ఒకానొక రోజు శ్రమ ఉంటుందని చెప్పాడు. 2:5–20 వరకు దేవుడు ఎలాంటి ప్రజలు ఉన్నారో, వారికి కలుగబోయే శ్రమ గూర్చి చెబుతున్నాడు.

స్వార్థపరులకు శ్రమ, వడ్డీ వ్యాపారులకు శ్రమ, అక్రమంగా సంపాదించేవారికి శ్రమ, అన్యాయస్థులకు శ్రమ, త్రాగుబోతులకు శ్రమ, విగ్రహారాధికులకు శ్రమ. ఇలా ప్రతి ఒక్కరికి రాబోవు తీర్పు గూర్చి చెబుతున్నాడు.

సమాజంలో జరుగుతున్న అన్యాయం, అక్రమం చూస్తున్నప్పుడు, చెడ్డవారు వృద్ధిలోకి వచ్చినప్పుడు మనం గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే ఆయన అందరిని చూస్తున్నాడని, వారి పాపాలకు తగిన న్యాయం చేస్తాడని.

### బి. దేవుని మహిమ

2:14- "భూమి యెహోవా మహోత్సవమును గూర్చిన జ్ఞానముతో నిండియుండును". దేవుని మహిమ ఎప్పటికీ ఉంటుంది. ఒకానొక రోజు సంపూర్ణంగా ఆయన మహిమతో నిండిపోతుందని చెబుతున్నాడు. దేవుని మహిమ, గొప్పతనం పరి స్థితులకు అతీతంగా ఉంటాయి.

### సి. దేవుని ప్రభుత్వం

దేవుడు హబక్కూకుకు ఆయన ప్రభుత్వము ఎప్పటికీ ఉంటుందని గుర్తు చేస్తున్నాడు. "అయితే యెహోవా తన పరిశుద్ధాలయంలో ఉన్నాడు, ఆయన సన్నిధిని లోకమంతయు మౌనంగా ఉండునుగాక" (2:20). పరిస్థితులు, వ్యక్తులు, న్యాయాధిపతులు, రాజ్యాలు అన్నీ ఆయన ప్రభుత్వము క్రిందే ఉన్నాయి. ఆయనకు బయట ఏమీ జరగటం లేదు. అన్నీ ఆయన ఆధీనంలో, ఆయన సార్వభౌమాధికారం క్రిందనే ఉన్నాయని గుర్తించాలి. గనుక మనం ఏదో జరిగిపోతుందని భయపడి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఇలా ప్రభువు తనతో మాట్లాడిన తరువాత హబక్కూకు ఆలోచన విధానం మారిపోయింది. ఆయన న్యాయం కోసం ఎదురుచూడాలని, విశ్వాసం కలిగి ఉండాలని, రానున్న రోజులలో ప్రభువు ఏమి జరిగించినా అంగీకరించేలా నిర్ణయం తీసుకున్నాడు. వాస్తవానికి రాబోవు సంగతులు తనకు, తన ప్రజలకు ఎంతో నష్టాన్ని కలిగించేవి అయినప్పటికి వాటిలో సంతోషిస్తాను అని చెబుతున్నాడు.

### 3. ముగింపు

"రాబోవు శ్రమ కంటే, తనలోని పాపం విషయమై ఎక్కువగా చింతించేవాడే నిజ క్రైస్తవుడు" అని ఒక



దైవజనుడు అన్నట్టుగా రాబోవు బాధలు, శ్రమలు, కష్టాల మీద కాకుండా మన వ్యక్తిగత జీవితంలో ప్రభువుకి అయిష్టమైన విషయాలను సరిచేసుకోవడం మీద శ్రద్ధ పెట్టాల్సినవారమైయున్నాము. ఎందుకంటే మన వ్యక్తిగత, కుటుంబ, సంఘ, సామాజిక జీవితాలు ఆయన సార్వభౌమాధికారం క్రిందే సురక్షితంగా ఉంటాయి. కాబట్టి రాబోవు రోజులలో గత సంవత్సరం కంటే భయంకరమైన పరి స్థితులు ఎదుర్కొన్నా భయపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఆయన న్యాయం తప్పి ప్రవ ర్తించడు. జరగబోయే అన్నివిషయాల్లో ఆయన మనకు తోడుగా ఉంటాడు. కావున మనం కూడా హబక్కూకు వలె ఈ నూతన సంవత్సరంలో రాబోయే ఎలాంటి పరిస్థితులనైనా అంగీకరిద్దాం, ఆయన సహాయంతో ఎదుర్కొందాం. ఆయన క్రిందే, ఆయనకు తెలిసే అన్నీ జరుగుతున్నాయని అర్థం చేసుకొని వాటిలో సంతోషిద్దాం.

"గుర్తు పెట్టుకో, దేవుడు నీకు ఇంకొన్ని రోజులు, సంవత్సరాలు ఇచ్చాడు అంటే అవి నీవి కాదు. నీ సమయం, నీ కుటుంబం, నీ పని, నీవు చేసేవన్నీ ఖచ్చితంగా ఆయనను మహిమపరచేవిగా ఉండాలి" అని ఎ.డబ్ల్యు టోజర్ గారు చెప్పినట్లు ఈ కొత్త సంవత్సరంలో ప్రభువును మహిమపరుస్తూ, నిశ్చింతగా బ్రతుకుదాం!

– శివరామకృష్ణ, స్టాఫ్ కోఆర్డినేటర్,
పిడుగురాళ్ళ

ప్రత్యేకం



# ఒకరినొకరు ప్రేమించడం

*"మీరు ఒకరినొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞ ఇచ్చుచున్నాను; నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరి నొకరు ప్రేమింపవలెను" – యోహాను 13:34*


క్రీస్తు మనలను ప్రేమించి, తన ప్రాణాన్ని మనకోసం అర్పించాడు. అది ఆయన ప్రేమ. ఆయన ప్రేమకు మనము అర్హులం కాకపోయినప్పటికీ ప్రేమించాడు. అలాగే మనం కూడా ఒకరినొకరు ప్రేమించాలని చెప్పాడు. ఈ ఆజ్ఞనుంచి మనం ఎందుకు తప్పిపోతున్నాం? తప్పిపోవడానికి అసలు మూల కారణాలేమిటి?

## అవిధేయత

దేవుడు మనలను తన స్వరూపమందు సృష్టించాడు, తన పోలికలో చేసుకున్నాడు. అయితే, దుష్టుడు మానవుని మోసగించాడు. హవ్వతో మాట్లాడాడు, ఎన్నిసార్లు మాట్లాడాడో బైబిల్లో రాయలేదుకానీ నెమ్మది నెమ్మదిగా ఆమె చిత్తాన్ని తనవైపుకు త్రిప్పుకొని దేవుని మీద అనుమానాన్ని పుట్టించాడు. తద్వారా దేవునికి అవిధేయులయ్యేటట్లు, సాతానుకు లోబడేటట్లుగా చేశాడు. చివరకు హవ్వ, ఆదాములిద్దరూ దేవునికి అవిధేయులయ్యారు. దేవుడు మంచివాడు, ఆయన నీతిమంతుడు, ఆయనలో ఏ పాపమును లేదు. ఆయన నీతి అనంతమైనది, ఆయన మంచితనం కూడ అనంతమైనది. ఎప్పుడైతే మనిషి, దేవునికి అవిధేయత చూపించి, దేవుని మీద తిరుగుబాటు చేసాడో మనిషి హృదయం ఘోరమైన దుష్టత్వంతో నిండిపోయింది.

## మానవుని హృదయం

మార్కు సువార్తలో ప్రభువు ఇలా చెప్పారు. మానవ హృదయంలో నుండి దురాలోచనలు, జారత్వములు, దొంగతనములు, నరహత్యలు, వ్యభిచారములు, చెడుతనములు, లోభములు, కృత్రిమము, కామవికారము, మత్సరము, దేవదూషణ, అహంభావము, అవివేకము – ఈ చెడ్డ గుణములు వస్తాయి. అందువలన హృదయములో నుండి వచ్చే ఈ చెడ్డగుణాలు మనిషిని అపవిత్రపరుస్తాయి. ఈ విషయాన్ని పురుషోత్తం చౌదరి గారు తన పాట "త్రాహిమాం క్రీస్తు నాథ"లో "త్రవ్వుచున్న కొలది పెరుగు తరగదు నా పాపరాశి" అని చెప్పారు. అంటే, మేము మా పల్లెటూరులో ఉన్నప్పుడు తోటలో, పొలములో చెడిపోయిన మట్టిని తొలగించి త్రవ్వి బయటవేస్తాము. మన హృదయములో నుండి కూడ ఇలా చెడిపోయిన వాటిని తీసి బయటపారవేయాలని అనుకున్నప్పుడు ఎంత త్రవ్వినా, ఎంతగా త్రవ్వి పారవేసినా ఇంకా ఆ చెడిపోయిన గుణాలు కన్పిస్తూనే ఉంటాయి. వయస్సు పెరిగే కొద్దీ క్రైస్తవ



జీవితంలో ముందుకు సాగిపోయేకొద్దీ ఇంకా చెడుతనం కన్పిస్తుందే గానీ ఎన్నటికిని తరగదు. అంటే, మనిషిలోనున్న చెడుతనం అనంతమైనది, విస్తారమైనది. అట్టి మానవుడిని ఆయన ఏలాగు ప్రేమించగలుగుతున్నాడు? దేవుడు మనిషిని ప్రేమించుటకు ఏకైక కారణం దేవుడే.

## దేవుని ప్రేమ అద్భుతమైనది

ఏదేను వనములో దేవుని మీద తిరుగుబాటు చేసినప్పుడు ఆదాము హవ్వలు ఎంతో కృంగి పోయారు. వారు ఆత్మలో చచ్చిపోయారు. సాతాను అబద్ధికుడని, మోసగాడని గ్రహించారు. అయితే వీరి హృదయము పాపముతో నిండిపోయింది. వీరిద్దరు నీతి విషయములో, పరిశుద్ధత విషయంలో చచ్చిపోయారు. అప్పుడు కరుణ గల దేవుడు ఒక చేత్తో ఆదామును, మరియొక చేతితో హవ్వను పట్టుకొని వారిద్దరిని ఆదరిస్తూ గొప్ప వాగ్దానం చేశాడు. అది ఆదికాండము 3:15లో చూస్తాము. అందులో దేవుని గొప్ప ప్రేమ కనబడుతుంది. ఆదికాండము నుండి అధ్యాయం వెంబడి అధ్యాయం చదువుతున్నప్పుడు దేవుని ప్రేమ మనకు అంతకంతకు అర్థమవుతుంది. నిజముగా ఆయన ప్రేమ అద్భుత ప్రేమ.

## క్రీస్తు ప్రేమ ఆశ్చర్యమైనది

ఇస్కరియోతు యూదా ప్రధాన యాజకుని వద్దకు వెళ్ళి 30 వెండి నాణేలకు ప్రభువును అమ్మి ఏ మీ ఎరగనట్టు 12 మంది శిష్యులతో కలిసి పస్కా భోజనానికి కూర్చున్నాడు. ఇదంతా ఎరిగిన ప్రభువు – ఇస్కరియోతు యూదాను ప్రేమించడం ఏ మాత్రమూ తగ్గించలేదు. మిగిలిన 11 మందిని ఎలా ప్రేమించాడో యూదాను కూడా అలానే ప్రేమించాడు. ద్రోహము చేస్తున్నప్పటికీ తన ప్రేమను తగ్గించలేదు. మానవులమైన మనకు ఇది ఆశ్చర్యము, అద్భుతము. ఎందుకంటే మనము మనలను ప్రేమించినవారిని ప్రేమిస్తాము. మనలను ప్రేమించనివారిని, మనకు ద్రోహము చేసేవారిని ఎన్నటికి ప్రేమించలేము. ప్రభువు అయితే తనకు ద్రోహం చేస్తున్న యూదాను కూడా అందరితో సమానంగా ప్రేమించాడు.

## తోటివారిని ప్రేమించడం ఎప్పుడు సాధ్యమౌతుంది?

ఇతరులను ప్రేమించడానికి మనలో పవిత్రమైన ప్రేమ లేదు. ఎప్పుడైతే ఆదాము ఏదేను వనములో పాపము చేశాడో అప్పుడు మానవుడు, నీతి విషయములో, పరిశుద్ధత విషయములో, ప్రేమ విషయములో చచ్చిపోయాడు. అందువలన మానవునికి ఇతరుల్ని ప్రేమించడం సాధ్యం కాదు. ఎంత ప్రయత్నించినా, ఎంతగా ప్రయాసపడినా ప్రేమించడం సాధ్యము కాదు. ఇలాంటి జిగటగల దొంగ ఊబిలో దిగజారిపోయిన మానవుని ఆయన ప్రేమించడం మానలేదు. మనకు అనుగ్రహించబడిన పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడియున్నది (రోమా 5:5). ఇది దేవుని కృప. మనము ఒకరినొకరు ఏలా ప్రేమించాలో మనకు తెలియదు గనుక ఆయనే మన హృదయములో తన ఆత్మను కుమ్మరించి మన హృదయములను దేవుని ప్రేమతో నింపియున్నాడు (రోమా 5:5).

## ఒకరిని ఒకరు ఎలా ప్రేమించాలి?

ఒకరినొకరం క్రీస్తువలె ప్రేమించడానికి మనం చేయవలసినదల్లా మన చిత్తాన్ని, లేక ఇష్టాన్ని ఆయనకు సమర్పించుకోవాలి. ఎప్పుడైతే మనము ఆయన ఇష్టం చేయడానికి ఇష్టపడతామో – పరిశుద్ధాత్మ దేవుడు మనలో పని చేస్తారు. దానికి మనము ఆయనను అడగాలి. "ప్రభూ, నన్ను నీవు ప్రేమిస్తున్నట్లు – నేను ఇతర విశ్వాసులను ప్రేమించాలి. ఎందుకనగా అలా ప్రేమించటం నీ చిత్తము. ప్రభూ మీరు నన్ను బలపరచండి, మీ ఆత్మశక్తితో నన్ను నింపండి" అని అడిగినప్పుడు ఆయన తప్పక మలను బలపరుస్తారు. తన పరిశుద్ధాత్మను మన హృదయములలో కుమ్మరిస్తాడు. అప్పుడు మన నుండి దేవుని ప్రేమ ప్రవహిస్తుంది.

ఎ.డబ్ల్యు. టోజర్ మాటల్లో చెప్పాలంటే "దేవుని కుమారుడైన క్రీస్తును ఎవరు మహిమపరుస్తారో వారిని దేవుడు పరిశుద్ధాత్మతో నింపుతాడు" అని చెబుతాడు. మనము పరిశుద్ధాత్మతో నింపబడినప్పుడు, మనలో నుండి ప్రవహించేది ప్రేమయే. లూకా సువార్త 11వ అధ్యాయం ప్రకారం – పరలోకమందున్న తండ్రిని అడుగువారికి ఆయన పరిశుద్ధాత్మను ఎంతో నిశ్చయముగా అనుగ్రహించును (లూకా 11:13).

## ప్రేమించలేకపోడానికి ఆటంకాలేమిటి?

### నేనే – మనమే

ప్రేమించలేకపోవడానికి కారణం నేనే, మనమే.

మనం ప్రేమించడానికి ఇష్టపడడం లేదు గనుక ప్రేమించటం లేదు. అయితే, ప్రేమించటానికి అవసరమైన ప్రేమను దేవుడు తన ఆత్మ ద్వారా మనకు అనుగ్రహించాడు. మనం కొంతమందిని మాత్రమే ప్రేమించడానికి ఇష్టపడి, మరికొంతమందిని ప్రేమించటానికి ఇష్టపడము. వారిలో మనకు ఇష్టం లేని గుణాలు ఉన్నప్పుడు వారి తప్పులు ఎత్తిచూపిస్తూ, విమర్శిస్తాము. అలా విమర్శించటం వల్ల, సభల్లో వారి మీద కేకలువేస్తూ విరుచుకుపడటం వల్ల ఎవ్వరికీ ఏమాత్రం మేలు కలుగదు.

### ప్రార్థన చేయకపోవడమే

ఇతరులలో చెడుతనం చూసినప్పుడు – మనం కూడ మరొక విషయంలో చెడుతనం కలిగి నవారమని గుర్తించి – వారి కొరకు, మన కొరకు ప్రార్థన చేసినప్పుడు మనలోని చెడుతనాన్ని ఆయన పరిహరించి మనల్ని పవిత్రపరుస్తాడు. కాబట్టి మన తోటి సహోదరులలో మనం ఎన్ని చెడ్డగుణాలు చూసినప్పటికీ విచారంతో కృంగిపోవద్దు, కోపముతో విరుచుకుపడొద్దు. వారి తప్పులను మనము మన తండ్రియైన దేవుని వద్ద ఒప్పుకుందాం. దానియేలు – తన కాలంలో ఉన్న యూదా అధికారుల పాపాల ను తన పాపాలుగా ఒప్పుకున్నాడు. నెహెమ్యా తన పితరులు చేసిన పాపాన్ని తన పాపంగా ఒప్పుకున్నాడు. అలాగే మన సంఘంలోని నాయకుల పాపాలను, తోటి సహోదరుల పాపాలను మనం ఒప్పుకుందాం. అప్పుడు కరుణ గల దేవుడు వారిని క్షమించి, తన కుమారుని రక్తముతో పవిత్రపరుస్తాడు, మనలను కూడ పవిత్రపరుస్తాడు, మనలనందరిని తన పరిశుద్ధాత్మతో నింపుతాడు. అలా చేసినప్పుడు మనలో వారిపట్ల దేవుడు ప్రేమను పుట్టిస్తాడు, ప్రేమ ప్రవహించేటట్లు చేస్తాడు. అప్పుడు ఇతరులు, అనగా మన సహవాసంలోని విశ్వాసులు మనకు కీడు చేసినా ఎంతో తేలికగా తీసుకుంటాము. అయ్యయ్యో! సాతానుడు నా సహోదరుడ్ని ఎంతగా ఈడ్చుకొనిపోతున్నాడని మనకు కీడు చేసిన వాని కొరకు ఎంతో ప్రేమతో ప్రార్థన చేస్తాము. అలా ప్రార్థన చేసేకొలదీ మన హృదయంలో నుండి ప్రేమ పొంగిపొరలుతుంది. ప్రేమించలేకపోవడానికి ముఖ్యమైన కారణం ప్రార్థన చేయకపోవడమే.

### ప్రేమరాహిత్యాన్ని ఎలా అధిగమించగలం?

మనలోని ప్రతి చెడును పరిహరించడానికి తండ్రి తన కుమారుడిని అనుగ్రహించాడు (మత్తయి 1:21). మనము తండ్రికి క్రీస్తు నామములో మొర్రపెట్టినప్పుడు మనకు విడుదల కలుగుతుంది. ఆయనే మనలను విడిపిస్తాడు. మనలో కార్యం చేసేది పరిశుద్ధాత్ముడే. ఆయన మనలో పనిచేయుట ద్వారా ప్రతివిధమైన పాపనైజం నుండి మనకు విడుదల కలుగుతుంది.

మనం ఇతరులను ప్రేమించకుండా మనలోని శరీరకార్యాలైన అసూయ, ద్వేషము, పగ.. మొదలైనవి ఆటంకపరుస్తాయి. ప్రతి శరీరకార్యమును చంపి వాటిని సమాధిచేయువాడు పరిశుద్ధాత్మ దేవుడే. అంతేకాదు క్రీస్తు పునరుత్థానమును బట్టి పరిశుద్ధాత్మ దేవుడు మనలో దేవుని నీతిని అనుగ్రహిస్తాడు (రోమా 4:25).

మనమందరం తప్పక తెలుసుకోవాల్సిన సంగతేంటంటే, పాపము అనగా 'ఆజ్ఞను అతిక్రమించుట'. దేవుడు ఎలా ప్రేమిస్తున్నాడో మనమునూ మన తోటివిశ్వాసులను అలానే ప్రేమించాలి. ఇది దేవుని ఆజ్ఞ. అలా ప్రేమించకపోతే పాపము చేసినట్లే. ఎప్పుడైతే మనలో ప్రేమలేదని మనము గుర్తిస్తామో అప్పుడు దేవుని సన్నిధికి వెళ్ళి మన తప్పును మనము ఒప్పుకోవాలి. అవసరమైతే మరలా మరలా ఒప్పుకోవాలి. ఆ పాపాన్ని క్షమించేవాడు, సమస్త దుర్నీతి నుండి కడుగువాడు ఆయనే (1 యోహాను 1:9). మనలను పవిత్రపరచి దేవుడు పరిశుద్ధాత్మతో నింపుతాడు.

ప్రాముఖ్యమైన సంగతి ఏమనగా ఎవరి మీదనైనా కోపము ఉన్నట్లయితే మనలో ప్రేమ ఉండదు. ప్రేమించలేము. అందుకు ఎవరి మీదనైనా కోపము వచ్చినా అది వెంటనే మనలో నుండి వెళ్ళిపోవాలి. కోపము వెళ్ళకుండ మన హృదయములో గూడుకట్టుకుని ఉన్నట్లయితే దేవుని సన్నిధికి వెళ్ళి అనగా మన గదిలోనికి వెళ్ళి తలుపు వేసుకొని రహస్యమందున్న తండ్రియైన దేవుని దగ్గర ఒప్పుకోవాలి. అప్పుడు ఆయన మనలోని కోపమును కడిగి – మన హృదయాన్ని ప్రేమతో నింపుతారు.

**– డా. పిట్టా సిరాజ్,** ఇవాంజిలిస్ట్, విజయవాడ





# భారతదేశంలో క్రైస్తవ విశ్వాసము

భారతదేశంలోని పురాతన విశ్వాసాలలో క్రైస్తవ్యం ఒకటి. దానికి సుదీర్ఘమైన, 2000 సంవత్సరాల చరిత్ర ఉన్నది. భారత సంస్కృతిలో వేళ్ళూనుకుని భారతీయ మతాలైన హిందూ, బౌద్ధ, సిక్కు మతాలను ప్రభావితం చేసింది. సమానత్వం, సౌభ్రాతృత్వం దాని ముఖ్య లక్షణాలు.

క్రీ.శ. 250వ సంవత్సరంలో పాలి భాషలో రాయబడ్డ 'తోమా క్రియలు' అనే పుస్తకంలో క్రీస్తు శిష్యులలో ఒకడైన థామస్ (St. Thomas) మొట్టమొదట పంజాబులో తక్షశిలకు వచ్చినట్లు రాయబడింది. బహుశా ఆయన క్రీ.శ. 48వ యేట ఈ ప్రాంతానికి వచ్చి ఉండవచ్చు. థామస్ ఈ ప్రాంతాన్ని ఎన్నుకోవటంలో గల ఒక కారణం ఆ ప్రాంతమంతా అనేక శతాబ్దాలుగా ఇండో గ్రీకులచే పరిపాలించబడి కొయినే గ్రీకు భాష అధికారికంగా వాడబడింది. అప్పట్లో ఈ ప్రాంతాన్ని పార్థియా అని కూడా అనేవారు. థామస్‌కు గ్రీకు భాష ధారాళంగా తెలిసి ఉండడం వల్ల ఆ ప్రాంతంలో సులభంగా క్రీస్తు సువార్తను బోధించగలిగాడు. ఆయన సువార్త సేవా ఫలితంగా తక్షశిల రాజైన గొండప్ప రాజు (Gondopharas) క్రైస్తవుడయ్యాడు. ఆ ప్రాంతాన్ని కుషానులు ఆక్రమించుకొన్న తర్వాత క్రైస్తవ్యం కొద్దిగా బలహీనపడినప్పటికీ ఉత్తర భారతంలో క్రైస్తవం మధ్య యుగాల వరకు కొనసాగింది.

గొండప్ప రాజు యొక్క నాణేలను క్రీ.శ. 1834వ సంవత్సరంలో పురావస్తు శాఖ కనుగొన్నది. ఆ నాణేలపై ఒకవైపు గొండప్పరాజు ముఖచిత్రం దాని క్రింద గ్రీకు లిపిలో 'గొండోపారస్' అని ఇంకోవైపు అనేక చిహ్నాలతో పాటు సిలువ కూడా ముద్రించబడి వాటిక్రింద దేవనాగరిలిపిలో గొండప్ప రాజు అని రాయబడింది. గొండప్ప రాజు పేరు తక్త్-ఇ-బాహి రాతి పలక మీద కూడా రాయబడి ఉన్నది.

క్రీ.శ. 52వ సంవత్సరంలో పరి. థామస్ కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్‌కు చేరుకున్నాడు. అప్పటికే కొచ్చిన్‌లో ఒక ద్వీపంలో హెబ్రీ భాష తెలిసిన యూదులు స్థిరపడ్డారు. థామస్‌కున్న హెబ్రీ భాషా పరిజ్ఞానం వల్ల ఆ ప్రాంతంలో సువార్త సేవ చేయడం సులభతరమైంది. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో అనేకచోట్ల క్రైస్తవ సంఘాల్ని స్థాపించాడు. పరి.థామస్ సేవా ఫలితంగా దక్షిణ భారతదేశంలో 17,550 మంది భారతీయులు క్రైస్తవులయ్యారు. చివరకు చెన్నైలో మైలాపూర్ వద్ద బ్రాహ్మణులు ఈటెలతో కొట్టి ఆయనను హతమార్చారు.

థామస్ సమాధి మైలాపూర్‌లో భద్రపరచబడి ఉన్నది. కానీ థామస్ యొక్క అస్థికలలో చాలామట్టుకు సిరియా దేశపు వ్యాపారి టర్కీలోని ఉర్ఫాకు తీసుకుని వెళ్ళి అక్కడ సమాధి చేశాడు.



మొదటి శతాబ్దానికి చెందిన క్రైస్తవ మందిరాన్ని కేరళలోని నీల్లకల అడవుల్లో క్రీ.శ. 1957వ సంవత్సరంలో పురావస్తు శాఖ కనుగొన్నది. బహుశా ఇది ప్రపంచంలోనే అతిపురాతన క్రైస్తవ మందిరమైయుండవచ్చు.

మొదటి శతాబ్దంలోనే క్రీస్తు యొక్క ఇంకొక శిష్యుడైన బర్తొలొమయి ముంబాయి దగ్గరి కళ్యాణ్ ప్రాంతాన్ని సందర్శించి క్రైస్తవ సంఘాన్ని పశ్చిమ భారతంలో స్థాపించాడు. ఈ విషయాన్ని క్రైస్తవ పీఠాధిపతులైన అరిజిన్ (క్రీ.శ. 185-254) యూసీబీయాస్, తమ గ్రంథాల్లో పేర్కొన్నారు. వారు భారతదేశానికి థామస్ వచ్చిన సంగతిని గూర్చి రాశారు. ఆ కాలంలో ఆ ప్రాంతాన్ని కాలియానా అనేవారు.

ఆంధ్ర రాష్ట్రానికి కూడా మొదటి శతాబ్దంలోనే క్రైస్తవ్యం వచ్చినట్లు ప్రముఖ చరిత్రకారుడైన గోపాలచారి పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్రంలోని మచిలీపట్నానికి వచ్చిన క్రైస్తవులు అలెగ్జాంద్రియా నుండి వచ్చిన గ్రీకులు. వారే ఆ ప్రాంతానికి 'మసుల' అని పేరు పెట్టారు (మసుల ఒక గ్రీకు రాజు పేరు).

క్రీ.శ. 180వ సంవత్సరంలో అలెగ్జాంద్రియాకు చెందిన క్రైస్తవ వేదాంతి పాంటేనియస్ (Pantaenues) భారత క్రైస్తవ సంఘ ఆహ్వానం మేరకు వచ్చాడు.

క్రీ.శ. 250వ సంవత్సరంలో రాయబడ్డ అపొస్తలుల బోధనలు (Didascalia Apostolorum) లో ఈవిధంగా రాయబడింది. "ఇండియా దాని పొరుగు దేశాలు జూడాస్ థామస్ యొక్క అపొస్తలత్వాన్ని, నాయకత్వాన్ని స్వీకరించాయి. ఆ స్థలాల్లోని సంఘాలకు పునాది వేసింది ఆయనే.

క్రీ.శ. 325వ సంవత్సరంలో నైసియాలో జరిగిన ప్రపంచ క్రైస్తవ వేదాంతుల మహా సభకు ఆంధ్రప్రదేశ్‌లోని దివిసీమ నుండి థియోఫిలస్ నాయకత్వంలో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నట్లు నైసియా ప్రతులు తెలుపుతున్నాయి.

క్రీ.శ. 522వ సంవత్సరంలో భారతదేశాన్ని సందర్శించిన అలెగ్జాంద్రియా వ్యాపారి కాస్మోస్ (Cosmas) 'క్రిష్టియన్ టోపోగ్రఫి' అనే పుస్తకంలో ఈవిధంగా రాశాడు. "తప్రాబెన్ (శ్రీలంక) లో క్రైస్తవ సంఘం ఉన్నది. మాలే (మలబార్) లో, కాలియానాలో క్రైస్తవ సంఘాలు వ్యాపించి ఉన్నాయి. ఆ కాలంలో కేరళ క్రైస్తవ సంఘం పారశీక సంఘ ఆధిపత్యంలో నడిపించబడుతున్నట్లు కాస్మోస్ రాశాడు.

ఆంగ్లో శాక్సన్ క్రానికల్ క్రీ.శ. 884వ సంవత్సరంలో ఆల్ఫ్రెడ్ రాజు మైలాపూర్‌లోని థామస్ సమాధికి తన రాయబారి ద్వారా విలువైన బహుమానాలు పంపాడు. ఆ రాయబారి చోళ దేశపు రాజైన ఆదిత్యను కలిశాడు. ఆదిత్య రాజు ఆల్ఫ్రెడ్ రాజుకు విలువైన ఆభరణాలు, సుగంధ ద్రవ్యాలు పంపినట్లు రాయబడింది.

పారశీక దేశం ముస్లింలచే ఆక్రమించబడిన తర్వాత భారతదేశంలో క్రైస్తవ సంఘం సిరియా దేశంలోని అంటియోక్ (Antioch) యాజమాన్యం క్రిందకు వచ్చింది.

క్రైస్తవ సువార్తతో పాటు విమతాలైన (Heresies) నెస్టోరియానిజం, మానికేయానిజం కూడా భారతదేశంలోనికి వచ్చాయి.

క్రీ.శ.13వ శతాబ్దంలో మార్కోపోలో భారతదేశాన్ని సందర్శించాడు. ఆయన డైరీల ప్రకారం అప్పటి భారతదేశపు ఆరుగురు రాజులలో ముగ్గురు క్రైస్తవులని రాశాడు. మైలాపూర్‌లో థామస్ సమాధి ఉందని, క్రైస్తవులు, ముస్లిములు దానిని పవిత్ర స్థలంగా భావిస్తారని ఆయన రాశాడు.

క్రీ.శ. 1375వ సంవత్సరంలో తయారుచేయబడ్డ నైసర్గిక పఠం (Map) ప్రకారం ఒరిస్సా, ఆంధ్ర తీరప్రాంతాలను సొలోమోన్ అనే రాజు పరిపాలించాడు.

విజయనగర సామ్రాజ్యం యొక్క వజీర్ (ప్రధానమంత్రి) క్రైస్తవుడని క్రీ.శ. 1442వ సంవత్సరంలో భారతదేశం సందర్శించిన ముస్లిం యాత్రికుడైన అబ్దుల్ రజాక్ రాశాడు.

మే 6, 1562వ సంవత్సరంలో ఫ్రాన్సిస్ జేవియర్ రాకతో మిషనరీ ఉద్యమం ప్రారంభమయింది. ఆయన ఆధునిక కుటుంబానికి చెందిన వాడైనప్పటికీ కాలికి చెప్పులు కూడా లేకుండా నడిచేవాడు. ఆయన కుష్టు రోగులకు, పేదవారికి, సమాజంలో తృణీకరించబడిన వారికి చేసిన సేవ శ్లాఘనీయమైంది. తర్వాత వచ్చిన మిషనరీస్‌కు అది ఒక ఆదర్శంగా నిలిచింది. క్రైస్తవ మిషనేరీలు మనిషి యొక్క ఆధ్యాత్మిక అవసరాలు మాత్రమే కాకుండా అతని మానసిక, భౌతిక, సామాజిక అవసరాల ను గుర్తించి మనిషిని మనిషిగా చూశారు. ప్రతి మనిషిలో దేవుని పోలికను, స్వరూపాన్ని గుర్తించి సామాజిక అసమానతలను తొలగించటానికి ప్రయత్నించారు.

మొఘలు చక్రవర్తియైన అక్బరు క్రైస్తవ జెస్యూట్ ఫాదర్స్ సేవలను గుర్తించి ఆ విశ్వాసం యొక్క ప్రత్యేకతలను పరిపూర్ణతను తెలుసుకోగలిగాడు. తన ఆస్థానానికి వారిని గౌరవంగా ఆహ్వానించి తమ విశ్వాసాన్ని ప్రచారం చేసుకోవటానికి, సువార్తను నమ్మినవారికి బాప్తీస్మము ఇవ్వడానికి అనుమతించాడు. లాహోర్‌లో చర్చ్ నిర్మాణానికి కూడా అనుమతించాడు.

క్రీ.శ. 18వ శతాబ్దం నుండి అనేక ప్రొటెస్టెంట్ మత శాఖలు కూడ భారతదేశంలో స్థిరపడ్డాయి.

## భారత సంస్కృతిలో మిషనెరీస్ పాత్ర

క్రైస్తవ మిషనె రీలు భారతీయ భాషలకు ఎనలేని సేవలు చేశారు. నిజానికి అనేక భారతీయ భాషలలో వ్యాకరణ పుస్తకాలను రచించిందీ, నిఘంటువులను రాసిందీ వారే. జీజిన్‌బాగ్ తమిళ వాఙ్మయానికి ఎనలేని సేవ చేశారు. మొట్టమొదటిసారి ప్రింటింగ్ ప్రెస్‌ను భారతదేశంలో ప్రవేశపెట్టింది వారే. విలియం కేరీ పండితుడు బైబిలు గ్రంథాన్ని 36 భారతీయ భాషలలోనికి అనువదించి ముద్రించాడు. భారతదేశంలోని మొట్టమొదటి వార్తా పత్రిక 'సమాచార్ దర్పణ్' ను కూడా ఆయనే ప్రారంభించాడు. మిషనరీ కాకపోయినప్పటికీ బ్రౌన్ దొర అనే క్రైస్తవ పండితుడు 600 మంది బ్రాహ్మణ పండితులను పోషించి తెలుగు సాహిత్యాన్ని భద్రపరచటానికి కారకుడయ్యాడు. హెన్రీ మార్టిన్ ఉర్దూ, పర్షియా భాషల్లోనికి అనువదించిన క్రొత్త నిబంధన ఉన్నత ప్రమాణానికి చెందింది. ఇంతకుమునుపు బ్రాహ్మణులచే ప్రాకృత (అనాగరి క) భాషలుగా ఎంచబడిన ప్రాంతీయ భాషలు క్రొత్త హుందాతనాన్ని, ఒరవడిని సంతరించుకున్నాయి.

క్రైస్తవ పండితులలో పురావస్తు శాఖకు చెందినవారు భారతదేశ చరిత్రను, సాంస్కృతిక గొప్పతనాన్ని వెలికి తీశారు. వారిచే పాలి లిపి చదవటం కనుగొనబడిన తర్వాత భారతదేశంలోని అనేక ప్రముఖ సామ్రాజ్యాలైన మౌర్య, శాతవాహన, వాటక మొదలగు వాటి గూర్చి తెలుసుకోగలిగాము. క్రైస్తవులచే అనువదించబడిన వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, బ్రాహ్మణాలు భారతదేశం యొక్క వాఙ్మయ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాయి.

మిషనరీస్ స్థాపించిన పాఠశాలలు, కళాశాలలు, వైద్యశాలలు, గ్రంథాలయాలు, సామాజిక సంస్థలు భారతదేశాన్ని వైజ్ఞానపరంగా ఆధునిక పరచడానికి ఎంతో దోహదపడ్డాయి.

## ప్రముఖ క్రైస్తవ నాయకులు

19వ శతాబ్దంలో వితంతు వివాహాల్ని ప్రోత్సహించి స్త్రీ అభ్యున్నతికి తోడ్పడిన వారిలో పండిత రామాబాయి ప్రముఖురాలు. ఇషాన్ ఉల్లా ఢిల్లీలో నియమించబడిన మొట్టమొదటి భారతీయ ఆర్చ్ డీకన్. నారాయణ వామన్ తిలక్ మరాఠి భాషలో గొప్ప కవి, పండితుడు. సాధు సుందర్ సింగ్ భారత దేశంలోని నలుమూలలా, టిబెట్టులోను గొప్ప సువార్త చేశాడు. నెహెమ్యా గోరె, క్రిష్ణా పిళ్ళై, పురుషోత్తమ చౌదరి వంటి అనేక మహా కవులు భారతదేశంలోని నలుమూలలా విల సిల్లారు. 20వ శతాబ్దంలో అతి ప్రాముఖ్యమైన భారతీయ సువార్తికుడు సహో. భక్తసింగ్.

2000 సంవత్సరాలుగా భారతదేశంలో వేళ్ళూనిన క్రైస్తవ్యం ప్రస్తుతం ఐక్యతా దిశలో పయనిస్తుంది. అందులో ప్రాముఖ్యమైన విజయాలు – అనేక శాఖలు కూడి దక్షిణ ఇండియా సంఘంగా, ఉత్తర ఇండియా సంఘంగా పరిణామం చెందటం గమనించదగ్గ విషయం. అనేకమంది భారతీయ వేదాంత పండితులు, బోధకులు, భారతీయ సంస్కృతిని చాటి చెప్తున్నారు.

– డా. పసుపులేటి మనష్షే, హైదరాబాద్

హెచ్చరిక



# రహస్య జీవితం

ఎవ్వరూ చూడనప్పుడు నీవు ఎవరివి? నీ జీవితం ఎలా ఉంటుంది? నీవు ఎన్నడూ తప్పు చేయవు అని దేవుడు అనుకోడు. కాని యధార్థవంతమైన జీవితం జీవించుటకు నీవు కట్టుబడి ఉండాలన్నది దేవుని కోరిక.

నిజాయితీకి ఈ లోకం గౌరవం ఇవ్వదు అని తెలుసుకోవడానికి ఎక్కువ కాలమే పట్టదు. ప్రభుత్వంలో, వ్యాపారాల్లో ఉండాల్సిన పారదర్శకత గూర్చి ప్రజలు మాట్లాడతారు. కాని అనుదిన జీవితానికి వచ్చేసరికి, మోసం చేయకపోతే, అబద్ధం చెప్పకపోతే బ్రతకలేం అని భావిస్తారు.

నీ జీవితంలోని అనుభవాలనే తీసుకో. సత్యాన్ని సాగదీస్తూ ఎన్నిసార్లు సాకులు చెప్పలేదు? నీ స్నేహితునికి, లేదా సహోద్యోగికి నిజం చెప్పడం ద్వారా వచ్చే ఫలితాన్ని నీవు తప్పించాలని భావించి అలా చేస్తున్నావేమో. లేదా, ఒక తప్పుడు నిర్ణయాన్ని సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తున్నావేమో. స్నేహితులారా, దేవుడు మన నుండి కోరుకుంటున్నది ఇలాంటి జీవితం కాదు. ఆయన మనకు ఒక శ్రేష్టమైన మార్గాన్ని ఇచ్చారు.

‘‘ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్యసహవాసము గలవారమైయుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును” 1 యోహాను 1:7.

వెలుగులో జీవించడం అంటే జీవితంలోని ప్రతి కోణంలో నిజాయితీగా జీవించడం.

సంబంధాలలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే విధానం, ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించే విధానం, మనం ఏమి చేస్తున్నాం, ఎలా చేస్తున్నాం... వీటన్నిటినీ దేవుడు పట్టించుకొంటాడు. ప్రజలను మోసంచేయడం చాలా సులువని భావించవచ్చు, కాని దేవుని మోసంచేయలేం. అత్యంత స్పష్టంగా మన హృదయంలోని నిజాన్ని ఆయన చూడగలడు, చూస్తాడు.

తండ్రి నీకు ఇచ్చిన ప్రతి ఆశీర్వాదాన్ని నీవు గుర్తుకు తెచ్చుకో. యధార్థత లేకపోతే ఆ ఆశీర్వాదాలన్నీ నాశనమౌతాయి. ఈ భూమిమీద నీవు తప్పించుకున్నా, పరలోకంలో ప్రభువు ముందు నిల్చొని, వాటన్నిటికీ లెక్క అప్పజెప్పాలి. జాగ్రత్త.

కాబట్టి, నీవు ఎవరవు? యధార్థవంతుడవేనా? అందరిముందు ఎలా ఉన్నావో, రహస్యంగా కూడా అలానే ఉంటావా? నీవు ఈ ప్రశ్నలను త్రోసిపుచ్చడానికి వీలులేదు. వాటిని నిర్లక్ష్యం చేయడానికి వీల్లేదు. పెద్ద ప్రమాదం పొంచి ఉంది జాగ్రత్త.

### యధార్థత ఎలా ఉంటుంది?

దేవుని దృష్టిలో యధార్థ జీవితం చాలా ప్రాముఖ్యమైన విషయం. సంబంధాలలో, ఆర్థిక విషయాల్లో, పనిలో, ఉద్యోగంలో..ఇలా జీవితంలోని ప్రతికోణంలో విశ్వాసులు యధార్థంగా ఉండాలని దేవుడు కోరుతున్నాడు. కాబట్టి యధార్థత అంటే ఏమిటో మనం ఖచ్చితంగా తెలుసుకోవాలి. కీర్తన 15లో యధార్థవంతుని లక్షణాలను, అతనికి వచ్చు ఆశీర్వాదాలను క్లుప్తంగా వర్ణిస్తున్నాడు.

### 1. దేవునితో సన్నిహిత సంబంధాన్ని కలిగిఉండుటకు యధార్థత చాలా అవసరం (కీర్తన 15:1-2)

మోసం, అబద్ధం దేవునితో మనం అనుభవించే సహవాసాన్ని భంగం చేస్తాయి. యధార్థవంతమైన మనస్సు, ప్రవర్తన గలవారే దేవునికి సమీపంగా ఉండగలుగుతారు. ఆయనతో సన్నిహిత సహవాసాన్ని అనుభవిస్తారు. దేవుడు మన నుండి కోరుకొనేది, మనం ఆయనతో సన్నిహిత సహవాసం చేయాలన్నదే.

### 2. యధార్థత మన పనుల్లో కన్పిస్తుంది, కాని అది మొదటిగా హృదయంలో ప్రారంభమౌతుంది (కీర్తన 15:2)

సత్యాన్ని, నీతిని అనుసరించి నడుచుకొనే ఒక జీవనశైలి ఇది అని దావీదు తెలియజేస్తున్నాడు. కాని యధార్థత అనేది మనం ప్రవర్తించే శైలి మాత్రమే కాదు. అది హృదయానికి సంబంధించినది. మనం అంతర్గతంగా యధార్థంగా ఉంటేనే గదా బహిర్గతంగా యధార్థంగా ఉండగలిగేది.

### 3. ఇతరులతో మన సంబంధాలను మన యధార్థత ప్రభావితం చేస్తుంది (కీర్తన 15:3-5)

మంచి పొరుగువారిగా, నమ్మకమైన స్నేహితులుగా క్రైస్తవులుగా ఉండాలి. పగతీర్చుకొనేవారిగాను, కొండెములు చెప్పేవారిగాను, ద్వేషించేవారిగాను, పుకార్లు చెప్పేవారిగాను ఉండకూడదు. మనకు సాధ్యమైనంతవరకు, మనం మాట నిలబెట్టుకోవాలి, ఇతరులను మోసం చేయకూడదు, ఎవర్నీ వాడుకోకూడదు. పాపపూరితమైన వ్యక్తులతో సహవాసం మన జీవితాన్ని కళంకపరుస్తుందని గుర్తుంచుకోవాలి. ప్రభువును నమ్మి, ఆయనను గౌరవించే వ్యక్తులతో సహవాసం చెయ్యాల్సిన అవసరం ఎంతో ఉన్నది.

### 4. యధార్థత జీవితానికి స్థిరత్వాన్ని ఇస్తుంది (కీర్తన 15:5)

నిజాయితీగా జీవిస్తే మనం దేనికి భయపడాల్సిన పనిలేదు. ఎందుకంటే అంతర్గతంగా, బహిర్గతంగా మనలో ఎలాంటి తప్పుఉండదు. సత్యం చెప్పినందుకు మనం శ్రమపడినా మనం కదల్చబడం. ఎందుకంటే దేవుని విధేయత అనే బండపైన మనం నిలబడ్డాము.

కీర్తన 15లో ఉన్న వ్యక్తిని నీ జీవితం ప్రతిబించిస్తుందా? దేవుడు నీ నుండి పరిపూర్ణజీవితాన్ని ఆశించనప్పటికీ..నీవు ఆయన ఆశించిన జీవనశైలిని అంటే యధార్థమైన జీవితాన్ని కలిగిఉండాలని ఆయన కోరుతున్నాడు.

### మనం యధార్థతను ఎందుకు వదిలిపెడతాము?

ఎందుకంటే మనం దేవున్ని పూర్తిగా విశ్వసించం. మనం ఎలా జీవించాలో బైబిల్ స్పష్టంగా తెలియజేస్తుంది. కాని మనం మన భయాల మీద, స్వార్థకోరికల మీద దృష్టిపెట్టినప్పుడు, మనకు కావాల్సినవాటిని మోసంచేసైనాసరే సంపాదించుకోవాలి, మనకు ఇష్టంలేని వాటిని వదిలించుకోవాలనే శోధనకు లొంగిపోతాము.

మన జీవితంలోని మన ఆత్మీయ నేత్రాలను మూసివేయడానికి అవకాశం ఎప్పుడు వస్తుందా అని సాతాను ఎదురు చూస్తుంటాడు. ఇది ఎవ్వరికీ హానిచేయదులే. ఎవ్వరూ చూడట్లేదులే. ఎవ్వరూ ఫర్‌ఫెక్ట్‌కాదులే, అంటూ సాతాను శోధిస్తాడు. కాని, మనం నిజంగా యధార్థతను కోరుకొంటే, మన హృదయంలో గ్రహించుటకు కూడా వీలులేని రూపంలో ఏపాపమైనా ఉన్నదేమో పరీక్షించుకోవాలి.

నిజం చెప్పాలా, అబద్ధం చెప్పాలా, పాపం చెయ్యాలా వద్దా అని శోధన సమయంలో కాదు నీవు నిర్ణయించుకోవలసింది. దేవుని వాక్యాన్ని నీ మార్గ




దర్శిగా ఉపయోగిస్తూ, నీవు ఇతరులతో కలిగిఉండే సంబంధాలను గూర్చి, నీ పనిని గూర్చి, ఆర్థిక పరమైన అంశాలను పరిగణలోనికి తీసుకొనేవిధానం గూర్చి ముందుగానే నిర్ణయాలు తీసుకో. అప్పుడు శోధనలు ఎదురైనప్పుడు నీ విలువలపై, నమ్మకాల పై నీవు గట్టిగా నిలబడతావు.

## మోసాలు-రకాలు

### డొంక తిరుగుడు మాటలు

కొండెములు, పుకార్లు ఇవన్నీ కూడా ముందుగా డొంక తిరుగుడు మాటలుగా, ఒక వ్యక్తిని గూర్చి పరోక్ష వ్యాఖ్యానాలుగా ప్రారంభమౌతాయి. ఆ మాటలవల్ల సదరు వ్యక్తి తప్పుచేశాడనే భావన ఇతరుల్లో కలుగుతుంది.

### తప్పుడు అభిప్రాయాలు కలిగించుట

ఒకానొక పరిస్థితిలో ఇతరుల దృష్టిలో మంచి వ్యక్తులంగా ఉండడానికి మనం అసత్యాన్ని అలంకరించి చెబుతాము లేదా సత్యంలో సగభాగాన్నే చెబుతాము. తద్వారా వినే వ్యక్తి దృక్పథాన్ని, అవగాహనను ప్రభావితం చేస్తాము.

### తెల్ల అబద్ధాలు

మన సంస్కృతి అబద్ధాలకు ఒక కొలమానాన్ని ఏర్పరచింది. ఇతరులకు హాని, నష్టం కలిగించని అబద్ధాలకు 'తెల్ల అబద్ధాలు' అని పేరు పెట్టింది. కాని ఇలా చేయడం ద్వారా మనం ఏమిచేస్తున్నామంటే దేవుని విలువలను మనకు అనుకూలంగా మలుస్తున్నాము. కాని దేవుడు అబద్ధాలకు కొలమానాలు, గ్రేడులు ఇవ్వడు. ఆయన దృష్టిలో అబద్ధం అబద్ధమే.

### సగంనిజం

మనల్ని మనం కాపాడుకోవడానికి, లేదా మనం లాభం పొందడానికి, నిజంలోని కొన్ని ప్రాథమిక విషయాలను దాచిపెడతాము. అయినా అది మోసమే. ఉదా॥ మీ కారును అమ్మాలనుకున్నారు. దాని కార్బోరేటర్ అంతగా పనిచేయదని చెప్పడం మరిచిపోయావు. అప్పుడు నీ కారు కొన్న వ్యక్తిని నీవు మోసం చేసినట్టే. అది నీవు కావాలని దాచినది కాదు. అయినప్పటికీ ప్రాముఖ్యమైన సమాచారాన్ని దాచిపెట్టడం ద్వారా నీకు లబ్ధి కలిగింది, అతనికి నష్టం వచ్చింది.

## యధార్థతను సంపాదించుకోవాలి, కొనసాగించాలి

మన స్వంత మార్గాలలో నడుచుకోకుండా, క్రీస్తు మార్గంలో నడుచుకోవడమే యధార్థత. మనం అనుకున్నది సాధించుకోవడానికి అబద్ధాలు, మోసాలు దగ్గరి మార్గాలుగా కనిపించవచ్చు. కాని అవి మరికొన్ని సమస్యలకు దారితీస్తాయి. మంచి ఫలితానికి ఖచ్చితమైన మార్గం ఏమిటంటే ప్రభువును వెంబడించడం, ఆయనమీద పూర్తిగా ఆధారపడడమే. నిజాయితీ వలన నష్టం, బాధలు వచ్చినా, అది వెలకట్టలేని యధార్థత అను లక్షణాన్ని ఫలితంగా ఇస్తుంది.

ఈ ఆర్టికల్ చదివిన తర్వాత నీ హృదయంలో ఏ పాపమైనా దాగిఉన్నదని పరిశుద్ధాత్ముడు చూపిస్తున్నాడా? అయితే, ఆ కలుపు మొక్కను పీకి వేయడానికి మొదటిపని ఏమంటే దాన్ని పాపంగా గుర్తించి ఒప్పుకోవడం. నీవు దాన్ని తీసివేసుకొని నీ మార్గాన్ని మార్చుకోవాలని దేవుడు కోరుకుంటున్నాడు.

దేవుని లక్ష్యం నిన్ను గద్దించడం కాదు. విధేయతద్వారా వచ్చు ఆశీర్వాదాలను నీ జీవితంలోనికి తేవడమే. మోసం అను పాపాన్ని నీవు ఒప్పుకొన్న తర్వాత, యధార్థమైన మార్గంలో ఉండడానికి అవసరమైన చర్యలను తీసుకో.

చివరగా యధార్థత లేకుండా జీవించుటకు నీవు నిర్ణయించుకొంటే నిన్ను నీవు మోసం చేసుకుంటున్నట్లే. ఒక రోజు చీకటిలో జరిగించినవన్నీ బహిర్గతం అవుతాయి (1కొరింథీ 4:5). ఇంత ప్రమాదం పొంచిఉంటే యధార్థతను అంతిమ లక్ష్యంగా చేసుకోవడానికి ఇంతకంటే మంచి సమయం ఉంటుందా? నీ భవిష్యత్ దీనిమీదనే ఆధారపడిఉంది.

– డా. స్టాన్లీజోన్స్, ఇన్‌టచ్ మినిస్ట్రీస్



# కమిట్‌మెంట్ కొంతకాలం మాత్రమే కాదు...

**నూతన సంవత్సరంలో ప్రవేశపెట్టిన దేవాదిదేవునికి వందనాలు చెల్లిస్తూ, గత సంవత్సరము ఆయన చేసిన మేలులను బట్టి స్తుతిద్దాం. ఈ నూతన సంవత్సరారంభంలో దేవుని దగ్గర మన కమిట్‌మెంట్‌ను మరొకసారి పునరుద్ధరించుకొందాం. ఆయన మనల్ని తన బిడ్డలుగా చేసుకొని, పరలోక వారసులుగా చేసిన దానిని బట్టి కృతజ్ఞతతో ఆయనకు మన జీవితాన్ని అర్పిద్దాం. ఆయన చేతిలో పాత్రలుగా ఉండడానికి యోగ్యమైన పనివారముగా ఉందాం. జీవితాంతం వరకు మన జీవితాన్ని ఆయనకు సమర్పించే విషయంలో ఈ క్రింది అంశాలను పరిశీలిద్దాం.**

## పవిత్రత

అపవిత్రతతో నిండియున్న ఈలోకంలో, అపవిత్రతతో రాజీ పడిపోతున్న ఈ రోజుల్లో అపవిత్రతను అంగీకరిస్తున్న మనుష్యుల మధ్య... పరిశుద్ధంగా దేవునికి మహిమతెచ్చే యువతీ యువకులు కావాలి. ప్రతి పాపానికి రాజీతో కూడిన పేర్లు వస్తున్నాయి. లంచానికి ఫీజని, కట్నంకి ఖర్చులని, రెండవ భార్యను చిన్నఇల్లని, తాగుడుకు మందని, వ్యభిచారాన్ని స్వేచ్ఛని, వివాహం కాకుండ కలిసి ఉండటం సహజీవనం అని, స్వలింగ సంపర్కం... మా హక్కుఅని... సమర్థించుకునే ఈ రోజుల్లో దేవుని దృష్టిలో ఏది పాపం, ఏది న్యాయం అనే విచక్షణ, దేవుని దగ్గరనుండి పొందే నిజాయితీ కావాలి.

దానియేలు బానిస, రాజు ఆజ్ఞకు లోబడి జీవించాలి. అయితే రాజు బల్లమీద ఆహారం తినమన్నప్పుడు అది విగ్రహార్పితం అని దేవునికి అవమానం తెచ్చేదని తినకుండా ఉండటానికి నిర్ణయం తీసుకున్నాడు (దాని 1:8). తన ప్రాణం పోయే ప్రతిపాదన అని తెలిసికూడా దానిని తెలియపరచడానికి వెనుదీయలేదు. అయితే దేవుని కోసం నిర్ణయం తీసుకొని ఆయనను ఘనపరుద్దామనుకున్న వారి చేతులు బలపరచడంకోసం దేవుడు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు (2 దిన 16:9). దేవుడు ఆ అధిపతికి దానియేలు మీద కృపా కటాక్షము పొందేలాగా అనుగ్రహించాడు (దాని 1:9). దానియేలు, హనన్యా, మిషాయేలు, అజర్యాకు పెట్టినది శాకాహారమే అయినా వారి ముఖములు ప్రకాశవంతంగా ఉన్నాయి. వీరు మిగిలినవారికన్నా పదంతలు శ్రేష్ఠులుగా కనపడ్డారు (దాని 1:20).

మనం దేవునికి యోగ్యమైన పనివారిగా ఉండటానికి నిర్ణయంతీసుకొంటే దేవుడు మనల్ని కాపాడి తన మార్గంలో నడిపిస్తాడు. చాలాసార్లు

మనం నష్టపోతామన్న భావనతో, దేవునికోసం నిలబడే విషయంలో భయపడతాం. భయం సాతాను యొక్క బలమైన ఆయుధం. వాడు దానితో మనల్ని లొంగదీసుకుంటాడు. మనం బలహీనులం అందుకనే దేవుడు కనీసం 365సార్లు భయపడవద్దు అని బైబిల్లో రాయించాడు. మనకు ధైర్యానిచ్చేది, మనకు భయంనుండి విడుదల నిచ్చేది ఆయన వాక్యం.

మన నిర్ణయం మన భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. మనం దేవుని కోసం పరిశుద్ధంగా, పవిత్రంగా జీవించాలనుకుంటే మనం అనేకమందికి సవాలుగా నిలుస్తాం.

## లైంగిక పవిత్రత

ఎటు చూచినా లైంగిక అపవిత్రతే. వాల్‌పోస్టర్స్‌లో ఇద్దరు యువతుల మధ్య హీరో, అక్రమ సంబంధాలు పెరుగుతున్న ఈ రోజుల్లో యౌవ్వనస్తులు, పెద్దవారు తీసుకోవలసిన నిర్ణయం లైంగికంగా పవిత్రంగా ఉండటం. నీ దేహము దేవుని ఆలయమైయున్నది. జారత్వమునకు దూరంగా పారిపోవుడి. మనుష్యుడు చేయు ప్రతి పాపమును దేహమునకు వెలుపల ఉన్నది. గాని జారత్వము చేయువాడు తన సొంత శరీరమునకు హానికరంగా పాపము చేయుచున్నాడు. మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై ఉన్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తుకాదు. విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి (1 కొరింథీ 6:18-20). ఈ మాటలు పౌలు కొరింథీ సంఘంలోనున్న పరిశుద్ధులకు రాస్తున్నాడు. ఈ మాటలు ఏ సంస్థకైనా, సంఘానికైనా వర్తిస్తాయి. మనం పరిశుద్ధులం అనుకోవడం మంచిదేగాని పరిశుద్ధంగా జీవిస్తున్నామా? అన్నది ప్రాముఖ్యం. కొరింథీ సంఘంలోని భయంకరమైన జారత్వం గురించి 5వ అధ్యాయం అంతా రాస్తాడు పౌలు. ఇది మనకు హెచ్చరికగా తీసుకోవాలి. ఒకర్ని ఒకరు ఎత్తి చూపించుకోవడం కాదుగాని, అందరం కలసి దేవునికి మహిమకరంగా జీవించే ఒక కుటుంబంగా ఉండే ధన్యత ఇమ్మని దేవుని దగ్గర ప్రాధేయపడాలి.

## ప్రభువును మహిమపరచడం

మన జీవితాల్లో నేర్చుకోవాల్సిన మరొక ప్రాముఖ్యమైన విషయం ఇది. 'రహస్య విశ్వాసి' అన్న పదం నుండి బయటకు రావాలి. కమ్యూనిజం,



మతఛాందసం ఉన్న దేశాల్లో ఆ పదానికి తావు ఉంటుంది గాని మన దేశంలో ఉంటున్న పరిస్థితులకు ఆ పదం నుండి విడుదల పొందాలి. షద్రక్, మెషెక్, అబెద్నగోలు అగ్నిగుడంలో వేయబడ్డారు. కేవలం విగ్రహానికి మ్రొక్కకుండా ఉండే ఆ నిర్ణయాన్ని బట్టి, కేవలం దేవునికి ప్రార్థనచేయడం వలన దానియేలు సింహాల గుహలో వేయబడ్డాడు. శిక్షను బట్టి వారు రాజీపడిపోవచ్చు, కానీ వారు రాజీపడలేదు. ప్రాణం పోయినా సరే దేవునికి మహిమ తేవాలనుకున్నారు. దేవునికోసం నష్టపోదామని నిర్ణయం తీసుకొన్నవారు ఏమీ కోల్పోలేదు. దేవున్ని, లోకాన్ని సమానంగా ఉపయోగించుకొందాం అనుకొన్నవారు రెండు పడవల మీద కాళ్ళుంచి ప్రయాణంచేసే ప్రయాణికుడే.

## యధార్థత

మన నడక, మన మాట విషయంలో జాగ్రత్తగా ఉండాలి. పౌలు భక్తుడు తిమోతికి ఇదే రాస్తాడు (1తిమోతి 4:16). నిన్ను గూర్చియు నీ బోధ గూర్చియు జాగ్రత్త కలిగి యుండుము, నీవీలాగు చేసి నిన్నును నీ బోధను వినువారిని రక్షించుకొందువు. ఇది రాయడంలో పౌలు ప్రాధాన్యతను గమనిస్తే మన మాట మన బాట సరిగా ఉంటే అది ముందు మనకే మేలు. లేకపోతే మనల్ని మనం మోసం చేసుకొంటాం.

ఈ రోజుల్లో క్రైస్తవ్యం వ్యాపారంగా మారిపోయింది. కార్పోరేట్ కాలేజీల తర్వాత ఏది మంచి వ్యాపారం అంటే క్రైస్తవ వ్యాపారం అని చెప్పే రోజుల్లో ఉన్నాం. సాతాను క్రియలను దేవుని క్రియలుగా చూపించే రోజులు. అబద్దాలను నిజాలుగా చిత్రీకరించే రోజులు. ఆ అపవిత్రతలో, ఆ ధనాశలో పడకుండా సహాయం చేయి ప్రభువా అని కన్నీటితో ప్రార్థన చేయవలసిన రోజులు. ధనాశ సమస్తకీడులకు మూలం. ప్రియులారా ..జాగ్రత్తగా ఉందాం. గొలుసు కట్టు

వ్యాపారాలు, మనీ రొటేషన్ మొ.. ప్రలోభాలకు లొంగవద్దు. సాతాను మార్గాన్ని కనిపెట్టడానికి కావల సిన విచక్షణా జ్ఞానంకోసం ప్రార్థన చేద్దాం.

యధార్థ హృదయం కలవారిగా ఉండి దేవునిని మన జీవితాల్లో చూపించే విధంగా సిద్ధపడుదాం.

**సువార్త వ్యాప్తి**

The cutting edge of UESI is Evangelism. మనం చేయవలసింది మనం చేస్తే మనం చేయకూడని వాటిని చేయడానికి సమయముండదు. ప్రాధాన్యత ఏర్పాటు చేసుకోవాలి. దేవుడు మనల్ని ఆయన సువార్త ప్రకటించడానికి ఎంచుకున్నాడు. ప్రజలను తన వైపుకు తిప్పేవారంగా మనం ఉండాలని మన గూర్చి ఆయన ఆలోచన కలిగిఉన్నాడు (మత్త 28:18-20). మనం దేవుని వైపు త్రిప్పేవారంగా ఉండాలి. దానియేలు 12:3లో "బుద్ధిమంతులైతే ఆకాశంలోని జ్యోతుల ను పోలినవారై ప్రకాశించెదరు. నీతిమార్గము ననుసరించి నడుచుకొనునట్లు ఎవరు అనేకుల ను ఆయన వైపు త్రిప్పుదురో వారు నక్షత్రములవలె నిరంతరము ప్రకాశించెదరు."

పౌలు 1 కొరింథీ 9:16-22లో సువార్త విషయంలో తన హృదయభారాన్ని పంచుకుంటున్నాడు. అయ్యో నేను సువార్త ప్రటించనియెడల నాకు శ్రమ అంటున్నాడు. ఎవరైనా సరే వారి స్థాయికి దిగి, వారికి సువార్త చెప్పడానికి పౌలు సిద్ధంగా ఉండేవాడు. పౌలు హృదయ స్పందన సువార్త చెప్పడం. ఏ విధము చేతనైనా కొందరినైనా రక్షణలోనికి నడిపించాలని తపించేమనస్సు కలిగియున్నాడు.

**పౌలు ఆచరించిన సూత్రాలు:**

- సువార్త చెప్పడానికి సిగ్గుపడను - రోమా 1:16
- సువార్త చెప్పే భారం నాపై మోపబడిఉంది - 1 కొరింథీ 9:16
- సువార్త వినని వారికి నేను ఋణస్తుడను - రోమా 1:14,15
- సువార్త ప్రకటించని యెడల నాకు శ్రమ - 1 కొరింథీ 9:16
- ఏవిధము చేతనైనా కొందరిని రక్షించవలెనని అందరికి అన్ని విధములవాడనైతిని - 1 కొరింథీ 9:22

మనం చేయవలసిన పనిచేద్దాం. నశించిపోయేవారిని రక్షించే పనిలో బిజీగా ఉందాం. సాతాను శోధన ఆహ్వానానికి 'సమయంలేదు' 'బయటకు వెళ్ళు' అనే బోర్డు చూపిద్దాం. దేవుడు మనల్ని పిలిచిన పిలుపుకు అవిధేయులము కాక ఆయన కొరకు జీవిద్దాం.

అపొ.కా. 26:19,20...ఆకాశమునుండి కలిగిన ఆ దర్శనమునకు నేను అవిధేయుడను కాక మొదట దమస్కులోని వారికిని, యెరూషలేములోను యూదయదేశమందంతటను తరువాత అన్య జనులకును, వారు మారుమనస్సు పొంది దేవుని తట్టు తిరిగి, మారుమనస్సునకు తగిన క్రియలు చేయవలెనని ప్రకటించుచుంటిని.

దేవుడు ఈ నూతన సంత్సరంలో మన యుఇయస్ఐ కుటుంబాన్ని మరింత నమ్మకమైన కుటుంబంగా వృద్ధిచేయాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం. దేవుని పాదాల దగ్గర మొరపెడదాం. దేవుడు ఈ నూతన సంవత్సర ఆశీర్వాదాలతో మన జీవితాల్ని నింపాలని, జీవితాంతం వరకు ఆయనకు మనల్ని మనం కమిట్ చేసుకోవాలని కోరుకొంటున్నాను.

**- యం.జయనేంద్ర కుమార్,** గుడివాడ

## విద్యార్థుల రచనలకు ఆహ్వానం



దేవుని కొరకు రాయాలనే ఆసక్తిగల సీనియర్ విద్యార్థులకు విద్యార్థిజ్వాల ఆహ్వానం పలుకుతుంది. కళాశాలలో మీ అనుభవాలు, ట్రెండ్స్, ఆర్టికల్స్, సాక్ష్యాలు, కవితలు, కార్టూన్స్ మొదలగునవి ప్రతి నెల 10వ తేదీలోపు మా ఇమెయిల్ editorvj@gmail.com కు పంపగలరు. ఈ చక్కటి అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోగలరు.

**- పి. సునీల్ జాకబ్,** ఎడిటర్



కథానిక

# ఆయుష్కాలము నీ వరమే!

మరో సంవత్సరం దయాకిరీటంగా దయ చేయబడి నూతనంగా దేహాన్ని అలంకరించింది. ఒప్పుకుని విడిచిపెట్టాల్సిన గతకాలపు పాపాల మీద తాత్కాలికంగా ముసుగువేసి నూతనవత్సరానికి స్వాగతం చెప్పడానికి మనసు తహతహలాడుతోంది.

కొత్త సంవత్సరం...క్యాలెండర్లలో మారుతోందో, క్యారెక్టర్లలో మారుతోందో తేల్చుకోలేక గోడకు కొట్టిన మేకులన్నీ దిగాలుగా చూస్తున్నాయి. క్యాలెండర్ పేజీల ను అలవోకగా తిప్పే చేతులు... చేతల్ని మార్చుకోలేక చేతకానట్లుగా మిన్నకుండిపోయాయి. ఆత్మవిమర్శ స్థానంలో ఆధిక్యత తొంగిచూస్తోంది. 'సజీవుని' పరిచయ స్థానంలో సంపదల మీదో సౌకర్యాల మీదో వ్యామోహం వెనక్కి లాగుతోంది. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఆత్మీయంగా తమను తాము సిద్ధపరుచుకొని ఎదగాల్సిన దేహాలన్నీ కొత్తసీసాలో పోసిన పాతద్రాక్షారసంలా ఒదిగిపోయాయి.

నడకలు, నడతలు అన్నీ... ఇరుకుమార్గాల్ని వదిలిపెట్టి విశాలమార్గాల్లో విహరించడానికి తొందరపడుతున్నాయి.చేసిన పాపాలనో, చేస్తూ వస్తున్న తప్పులనోక్షమించి ఎన్నో నూతన వత్సరాల ను బహూకరిస్తున్న దేవుడి పట్ల కృతజ్ఞత కలిగి వుండాల్సిన దేహాలన్నీ... కుర్చీల కోసమో, చర్చిలో చేసే ప్రసంగాల కోసమో తమవ్యక్తిత్వాల అస్తిత్వాల ను అస్తవ్యస్తంగా చేసుకుంటున్నాయి.

***

"తమ్ముడూ... దేవుడు దయామయుడు. నువ్వు తొందరగా కోలుకుంటావు. ధైర్యంగా ఉండు"

''తమ్ముడూ... నీకోసం మనవాళ్లంతా ప్రార్థిస్తున్నారు. ధైర్యంగా ఉండు"

"తమ్ముడూ... చనిపోయిన వాళ్లను తిరిగిలేపిన దేవుడు మనకున్నాడు. ధైర్యంగా ఉండు. దేవుడు అద్భుతం చేస్తాడు'' అని చెప్తున్న వాళ్లవంక ఆరాధనాభావంతో చూశాడు శామ్యూల్. కంటిచివర్ల నుంచి కన్నీటిబొట్లు రాలి చెంపలపై జారాయి. వచ్చినవాళ్ళెవరో తెలియదు. అయినా దేవుని ప్రేమనుబట్టి చూడడానికి ఎక్కడెక్కడి నుంచో వచ్చి ప్రార్థన చేస్తున్న వాళ్ళవంక కృతజ్ఞతగా చూస్తూ కళ్లతోనే వాళ్లను పలకరించసాగాడు శామ్యూల్. గొంతునుంచి మాటరాదు, కంటిమీద కునుకులేదు. వెలుగుతున్న లైట్లవంక, తిరుగుతున్న నర్సులవంక, చేతి నరాల ద్వారా ఒంట్లోకి నిశ్శబ్దంగా ప్రవహిస్తున్న సెలైన్ బాటిళ్ల వంకా నెలనుంచీ చూస్తూనే ఉన్నాడు. తిరుగుతున్న గడియారం ఎవరికోసం ఆగకుండా తన పని తాను చేసుకుపోతున్నట్లుగా రోగుల కివ్వాల్సిన మందులు కేటాయించిన సమయానికి యథాలాపంగా ఇచ్చేస్తున్నారు నర్సులు. ఒక్కో బెడ్ మీద పేషెంటుదీ ఒక్కో వ్యథ. ఆశకీ–నిరాశకీ మధ్య, చావుకీ–బతుక్కీ మధ్య నలిగి పోతున్న మనుష్యులంతా కళ్లనిండా చావుభయాన్ని నింపుకుని అయోమయంగా అటూఇటూ చూస్తూ కాలం గడుపుతున్న వాళ్ళను చూస్తుంటే శామ్యూల్‌కి ఎంతో బెంగగా ఉండేది.

మధ్యమధ్యలో ట్రైనింగ్ డాక్టర్లని వెంటేసుకుని వచ్చి రోగుల్ని, వాళ్ల రోగలక్షణాలని పరిచయం చేస్తున్న సీనియర్ డాక్టర్స్ శామ్యూల్ని చూపిస్తూ "జి.బి సిండ్రోమ్ పేషెంట్. నెలనుంచీ ఇక్కడే ఉన్నాడు. ఆక్సిజన్ లెవెల్స్ పడిపోతే కొన్నాళ్లు వెంటిలేటర్ మీద ఉంచాం. షుగర్ లెవెల్స్, బీపీ లెవెల్స్ అమాంతం పెరిపోయాయి. వాటిని కంట్రోల్ చేస్తూ వైద్యం చేయడం వల్ల 'ఐదురోజుల ఇంజెక్షన్ కోర్సు' బాగా ఆలస్యమైంది. దాదాపు పోయాడనే అనుకున్నాం. అదృష్టవంతుడు..." అంటూ చెప్పసాగాడు.

మగతతో మూసుకుపోతున్న కనురెప్పల్ని బల వంతంగా మూస్తూ తెరుస్తూ వాళ్లు చెప్పుకుంటున్న మాటల్ని వినసాగాడు శామ్యూల్. 'అదృష్టం' అనే మాట వినగానే అంత విషాదంలోనూ నవ్వొచ్చింది. బతికున్నవాళ్లను 'అదృష్టవంతులు గా', చనిపోయినవాళ్లను 'దురదృష్టవంతులుగా' లె క్కేస్తున్న వాళ్ళ అజ్ఞానానికి మనసులోనే మరోసారి నవ్వుకున్నాడు. కేవలం బతికి ఉండడమే అదృష్టం కాదని, బతికి ఉన్న కాలంలో నిజదేవునిని గుర్తించి సొంత రక్షకునిగా ఈ లోకం అంగీకరించడమే నిజమైన అదృష్టమని, అలా గుర్తించలేని మానవాళి అంతా 'బతికి ఉన్న దురదృష్టవంతు లు' అనుకున్నాడు. అదృష్టం, దురదృష్టం అనే మాటల్ని ఉపయోగించడం తనకిష్టంలేదు, అంతా దేవుని కృప, ఆయన చిత్తం అనుకున్నాడు. మనకు తెలిసేటట్టుగా మన చావుపుట్టుకలు, మన జీవిత గమ్యాన్ని నిర్దేశించేటట్టుగా మన అదృష్ట - దురదృష్టాలుంటే ఒక మనిషికి మరో మనిషితో, దేవునితో అవసరమేముంటుంది? దేవుని చిత్తం లేకుండా కష్టార్జితాన్నే అనుభవించలేని మానవాళి అదృష్ట దురదృష్టాలను నమ్ముకొని ఆయుష్కాలాన్ని పెంచుకోగలదా?

ఎలాంటి పరిస్థితుల్లో తాను ఆసుపత్రిలో చేరాడో లీలగా గుర్తుకురాసాగింది. స్వాధీనంలో లేకుండా, బరువెక్కిపోయి, స్పర్శలేకుండా, మొద్దుబారినట్లుగా ఉన్న పాదాలను చూసుకుంటున్న కొద్దీ గట్టుతెగి నట్లుగా దు:ఖం పొంగుకొచ్చేది. ఎవరో ఇద్దరు మనుషులు రెండు పాదాలను గట్టిగా పట్టుకుని పదునైన చాకులతో కాలి నరాలను కోస్తున్నట్లుగా అల్లాడిపోయేవాడు. గాజుపెంకులను పాదాలపై పోసి బలంగా నొక్కుతున్నట్లు విలవిల్లాడిపోయేవాడు. నిప్పులగుండంపైన నడిపించినట్లుగా వచ్చే మంటల ను తట్టుకోలేక కన్నీళ్లు కార్చేవాడు!ఒకరా ఇద్దరా... షిఫ్టులు మారుతున్న సిస్టర్లందరూ తలనిమిరి 'దేవుడు నిన్ను బతికిస్తాడని' చెప్తుంటే అంత బాధనూ మర్చిపోయి ఎంతో ఊరడిల్లేవాడు. జీవితంలో ఎన్నో జరుగుతుంటాయి. ఇలాజరగడం దేవుని చిత్తమని, దీని ద్వారా ఏదో పాఠం నేర్పించడం దేవునికి ఇష్టమని గ్రహించడం మంచిదనిపించింది. కళ్లు మూసుకున్నాడు శామ్యూల్. కనుకొలుకుల్లో నిలిచిన కన్నీళ్లు మళ్లీ చెంపలపైకి జారాయి. పెదవులు కదలట్లేదు కానీ అస్పష్టంగా వస్తున్న ఏవో మూలుగులు తనను ఉక్కిరిబిక్కిరి చేయడం గమనించాడు శామ్యూల్. డాక్టర్ల వంక నిర్వేదంగా చూశాడు. దేవుని అపారమైన కృప తనపై లేకపోతే ఈపాటికి తన జీవితం ముగిసిపోయేది. దేవుడు తన స్వహస్తాన్ని తనకోసం చాపాడు. మరణ వేదనను దాటించి స్వస్థతను ప్రసాదించాడని తల్చు కుంటున్న కొద్దీ శామ్యూల్ హృదయం భారంతో నిండిపోయింది.

తనలో తనే గొణుక్కుంటూ"ప్రభువా... ఇన్ని సంవత్సరాల జీవిత ప్రయాణంలో నీకెంత విధేయతగా జీవించానో నాకు తెలియదు. ప్రార్థనలో ఎంత సమయం గడిపానో తెలియదు. నీ పరిచర్యలో ఎంత ముందుకెళ్ళానో తెలియదు. గాలికి కొడిగట్టిపోతున్న ఎన్ని విద్యార్థి దీపాలకు నా అరచేతులు అడ్డుపెట్టానో తెలియదు. అయినా నన్ను క్షమించావు, ప్రేమించావు, కరుణించావు. చావుగోతినుంచి బయటికి లాగి ఆయుష్కాలాన్ని అనుగ్రహించావు. నూతన సంవత్సరాన్ని బహుమతిగా దయచేశావు. నూతనజీవాన్ని నాలో నింపి నన్ను నిలబెట్టావు. నా ఆధిక్యతలు, పోగేసుకున్న సంపదలు, వెంటబడిన లోకాశలు, వదలలేని సౌకర్యాలు... ఇవేమీ నన్ను బతికించిన కారణాలుగా కనిపించలేదు. కేవలం నీ కరుణే నన్ను బతికించింది. ఈ నూతన సంవత్సరం నీ వాక్యాన్ని ధరించడానికి, నీ వాక్యాన్ని ప్రకటించడానికి, నశిస్తున్న విద్యార్థుల్ని నీలో నడిపించడానికి కావల సిన కృపను అనుగ్రహించు" అనుకున్న శామ్యూల్ మనసు ఆనందంతో నిండిపోయింది.

**- డా. జడా సుబ్బారావు,** నూజివీడు

# జీవితం అల్పమైనది



జీవితం అల్పమైనది!
అల్పమైన రోజులు స్వల్పమైన సంవత్సరాలు
గడిచిపోతున్న గంటలు పరుగులు తీస్తోన్న నిమిషాలు
ఇంతలో అభివందనం చేస్తాయి
అంతలో వీడ్కోలు పలుకుతాయి
జీవితకాలం ఎంతగా కుదించబడింది!

జీవితంలో ఎదురొచ్చేవన్నీ అల్పమైనవే!
ఆశలు అవకాశాలు ఆనందాలు అనురాగాలు
అన్నీ ఇంతలో ముందుకొచ్చి అంతలో మాయమయ్యేవే
ప్రతి నిమిషం నిత్యత్వంతో ముడిపడి ఉండేదే
ఈ జీవితంలో అన్నీ అల్పమైనవే
మనకు కనిపించేవన్నీ స్వల్పమైనవే!

జీవితంలో ప్రత్యామ్నాయాలు ఎన్నో, ఎన్నెన్నో!
కాని, అవన్నీ కేవలం అల్పమైనవే స్వల్పమైనవే
నువ్వు వేసే ప్రతి అడుగునూ ఆయన గమనిస్తున్నాడు
నీ ప్రతి పనినీ ఆయన తన గ్రంథంలో లిఖిస్తున్నాడు
తనకోసం చేసే ప్రతి పనికీ నీకు నిత్యమైన బహుమానం
జీవితంలో ప్రత్యామ్నాయాలు ఎన్నో ఎన్నెన్నో!

కాని, అల్పంగా కనిపించేవన్నీ స్వల్పమైనవి కావు!
నిత్యమైన పంటకోసం విత్తబడే విత్తనాలే అవన్నీ
నిత్యమైన ఆనందాన్ని అందుకొనే అవకాశాలే అవన్నీ
వెయ్యింతల ఆశీర్వాదాల్ని అందించే అనుభవాలే అవన్నీ
నువ్వు చేసే ప్రతి మంచిపనీ వెలకట్టలేనంత విలువైనదే
నీకు అల్పంగా కనిపించేవన్నీ స్వల్పమైనవి కావు!

దేవుని కోసం నువ్వు పడే కష్టాలు నష్టాలు కావు!
ఆయన కోసం జీవించే జీవితం ఎన్నటికీ నష్టాన్నివ్వదు
ఆయన కోసం నువ్వు ఖర్చు చేసే నీ సమయం
ఆయన పేరిట దరిద్రులకు నువ్వు చేసే దానధర్మాలు
ఆయన కోసం నువ్వు పడే శ్రమలు ప్రయాసలు
అన్నీ పరలోక పట్టణంకోసం నువ్వు పెట్టే పెట్టుబడులే!

– వెస్లీ. యల్. డ్యూవెల్
(మెజర్ యువర్ లైఫ్ పుస్తకం నుంచి)

# కోశాధికారి బాధ్యతలు

క్రీస్తునందు అతి ప్రియమైన యుఇయస్ఐ-ఏపి కుటుంబ సభ్యులకు, కోశాధికారులకు, ప్రార్థనా సహకారులకు మన ప్రభువైన యేసుక్రీస్తు నామంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ప్రతి ఇయు, ఇజియఫ్‌లోని కోశాధికారులు తమ బాధ్యతలు తెలుసుకొని, వాటిని నిర్వర్తించాలని కోరుచున్నాను.

**గత సంచిక తర్వాత...**

**4. అకౌంటు పుస్తకం:** పద్దులను లేదా ఖాతాలను (accounts) సులువుగా సరిగ్గా నిర్వహించడానికి రశీదు పుస్తకంతోపాటు మరొక పుస్తకం కూడా అవసరం. అదే ఖాతాల పుస్తకం (account book). ఎక్కువ మొత్తంలో డబ్బును నిర్వహించని చిన్న ఇయులో ఆర్థిక పరమైన అంశాలను కోశాధికారి సరిగ్గా నిర్వహించడానికి ఈ రెండు పుస్తకాలు సరిపోతాయి. ఇయులో సభ్యత్వాలు పెరిగి, సభ్యుల దాతృత్వం పెరిగి, ఎక్కువ మొత్తంలో డబ్బు వస్తున్నట్లయితే, ఇంకొంచెం సంక్లిష్టమైన ఖాతాల నిర్వహణ విధానం అవసరమౌతుంది.

సరళమైన ఖాతాల నిర్వహణ విధానంలో ఖాతాల పుస్తకం గట్టి అట్టతో ఉండాలి. పేజీలపై నీలంరంగు గీతలు కలిగి, 50 నుండి100 పేజీలు ఉండి, వాటిపై వరుస క్రమంలో సంఖ్యలు ఉండాలి. పేజీలు $8^{1/2}$, $13^{1/2}$ పరిమాణంలో ఉండాలి. కొన్ని సంవత్సరాలపాటు ఆ పుస్తకం చినిగిపోకుండా ఉండేటట్లు దాని అట్టను గట్టి బైండింగ్‌తోను, ప్లాస్టిక్‌తోను భద్రపరచాలి.

మొదటి పేజీమీద ఇయు పేరును ఇలా రాయాలి: యూనిపేట ఇంటర్ కాలేజియేట్ ఇవాంజలికల్ యూనియన్, కోశాధికారి ఖాతా పుస్తకం". చివరి పేజీలో యుఇయస్ఐ కార్యాలయం చిరునామా రాసి, దాని క్రింద ఈ పుస్తకం మీకు దొరికినయెడల, దీనిని దయచేసి పై చిరునామాకు పంపించగలరు అని రాయాలి.

పుస్తకాన్ని తెరచి ఆ సంవత్సర సంఖ్య రెండు పేజీల మధ్య గుండా వెళ్ళునట్లు రాయాలి. తర్వాత పేజీలలో ఎడమవైపు పేజీల పైన 'ఆదాయం' అని, కుడిచేతివైపు పేజీలపైన "ఖర్చు" అని రాయాలి. ప్రతి పేజీ చివరి రెండు గీతల వద్ద ఆదాయం మొత్తం, ఖర్చు మొత్తం లెక్క కట్టాలి. క్రొత్త పేజీలో మరలా వచ్చిన మొత్తం ఆదాయన్ని రాసి, "వివరాలు" అన్న కాలమ్ వద్ద మిగులు (Brought forward) డబ్బును రాయాలి. ఖర్చు వివరాలను కూడా ఇదే విధంగా రాయాలి.

అకౌంట్ స్టేట్‌మెంట్ తయారుచేయాల్సిన అవసరం వచ్చినప్పుడు, ఖర్చుల మొత్తాన్ని కూడి, దీన్ని మొత్తం ఆదాయంలో నుండి తీసివేస్తే, మిగులు ఎంత ఉన్నది లేదా బ్యాంకులో ఎంత ఉన్నది అన్న విషయం తెలుస్తుంది.

మిగిలినవి వచ్చే సంచికలో...

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2021 తర్వాత పెరిగిన 18% బడ్జెట్‌కు అనుగుణంగా 19 ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపిస్తున్నాయి. వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. మిగిలిన ఇజియఫ్‌లు కూడా ప్రార్థించి సహకరించవలసిందిగా కోరుచున్నాము.
2. యుఇయస్ఐ నేషనల్‌కు ప్రతి నెల ఆఫీసునుంచి పంపే కాంట్రిబ్యూషన్స్ 75,000/- నుంచి 80,000/- రూ. పెంచడానికి స్టేట్ యాన్యువల్ కౌన్సిల్‌లో నిర్ణయించారు. పెరిగిన 5,000/- కొరకు
3. ప్రేయర్ హాట్ పూర్తిచేయడానికి 1.40 లక్షలు, స్టెరెట్ బ్లాక్ రిపేర్ వర్క్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్ కొరకు 5 లక్షలు అవసరం
4. యాన్యువల్ ఇంక్రిమెంట్, నూతన కో-ఆర్డినేటర్స్ నియామకాల వలన అవసరమైన అదనపు ధనం 60 వేల కోసం
5. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు
**యస్.ఆర్.డి. కిషోర్ కుమార్**

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,10,000/- (18% Hike W.R.T present income)**

**NOVEMBER 2021**

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 589.00 | Field Staff Salaries | 4,63,416.00 |
| General Fund | 8,90,925.00 | Field Staff HRA, CA, MA & TA | 2,47,640.00 |
| Staff Support | 60,000.00 | Office Staff Salaries | 1,82,184.00 |
| Rajasthan | 30,000.00 | UESI | 80,000.00 |
| Jammu & Kashmir | 15,000 | APEGF | 3,000.00 |
| SWF | 53,000 | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | Office Expenditure | 27,455.00 |
| | | Closing Balance | 819.00 |
| **Total** | **10,49,514.00** | | **10,49,514.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-12-2021**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508

# యుఇయస్ఐ -ఏపి క్యాలెండర్ - 2022



ఆకర్షణీయమైన **2022** క్యాలెండర్స్ నంబూరు ఆఫీస్‌లో సిద్ధంగా ఉన్నాయి.
కావలసినవారు త్వరపడండి, ఆర్డరు చేసుకొండి.
మీ జిల్లా/రీజినల్ కోఆర్డినేటర్లు/స్టాఫ్, ఆఫీస్ స్టాఫ్
**బ్ర. పి. జగదీష్** – (9493240435) ను సంప్రదించండి.
– డా. జె. సుబ్బారావు – (9849031587) లిటరేచర్ సెక్రటరీ